విశాలాంధ్ర

ప్రకాశం

బాపట్ల

గురువారం 25 జూలై 2024 8 పేజీలు

అధికారుల బదిలీలకు రంగం సిద్ధం

- డీఆర్‌డీఏ పీడీగా వెంకటరెడ్డి, మెప్మా పీడీగా రవికుమార్ ?
- ఎస్ఐ, సీఐల బదిలీలకు పచ్చజెండా
- అసెంబ్లీ సమావేశాలు ముగిసిన వెంటనే పోస్టింగ్‌లు

విశాలాంధ్ర బ్యూరో-ఒంగోలు : రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఐఏఎస్, ఐపీఎస్ బదిలీలు ముగిశాయి. ఇక జిల్లా అధికారులు సీఐలు, డీఎస్పిలు, ఎస్ఐల బదిలీలపై కొత్తగా గెలిచిన ఎమ్మెల్యేలు, మంత్రులు దృష్టి సారించారు. జిల్లాలో గత ప్రభుత్వ హయాంలో పనిచేసిన మెప్మా, డీఆర్‌డీఏ, డీపీఓ, ఆర్డీవో, డీఆర్‌ఓ ఇలా కీలకమైన జిల్లా స్థాయి అధికారుల బదిలీలకు రంగం సిద్ధమైంది. జిల్లాలోని తెలుగుదేశం పార్టీ తరపున గెలుపొందిన ఎమ్మెల్యేలు, జిల్లాకు చెందిన మంత్రులు డోలా బాల వీరాంజనేయస్వామి, గొట్టిపాటి రవికుమార్ అందరూ కలిసికట్టుగా విజయవాడలో కూర్చొని జిల్లాకు ఏ అధికారులు అయితే బాగుంటుందనే దానిపై సుదీర్ఘంగా చర్చించుకున్న అనంతరం జిల్లా అధికారుల బదిలీల వ్యవహారం ఒక కొలిక్కి వచ్చినట్లు తెలుస్తుంది. దీనిలో భాగంగానే డీఆర్‌డీఏ పీడీగా వెంకటరెడ్డి, మెప్మా పీడీగా రవికుమార్‌తో పాటు పలు కీలకమైన శాఖల అధికారుల పేర్లను ఖరారు చేసి ఎమ్మెల్యేలందరూ సంతకాలు పెట్టి ఆ జాబితాను సీఎంకు అందజేసినట్లు తెలుస్తుంది. ప్రస్తుతం రాష్ట్ర అసెంబ్లీ సమావేశాలు జరుగుతున్నాయి. ఈ సమావేశాలు ముగిసిన వెంటనే జిల్లా అధికారుల బదిలీలు సంబంధించి పోస్టింగ్‌లు పడే అవకాశం ఉన్నట్లు సమాచారం. తహశీల్దార్లు, ఎంపీడీఓల బదిలీలు కూడా జరగనున్నాయి. ఇప్పటికే ఆయా నియోజకవర్గాల్లో తహశీల్దార్లు, ఎంపీడీఓలతో పాటు పీహెచ్‌సి, పంచాయితీరాజ్, ఆర్‌డబ్ల్యుఎస్, గృహ నిర్మాణం, వెటర్నరీ ఇలా మండలస్థాయి అధికారుల బదిలీలకు రంగం సిద్ధం చేస్తున్నారు. కొత్తగా ప్రభుత్వం ఏర్పడిన తరువాత సహజంగా అధికారుల బదిలీలు జరగడం అందరికి తెలిసిందే. మరో కీలకమైన శాఖలో పోలీసు విభాగం ఒకటి. ఈ డిపార్ట్‌మెంట్‌లో డీఎస్పి, సీఐ, ఎస్ఐల పోస్టింగ్‌ల కోసం కూడా తీవ్ర పోటి నెలకొంది. వీరిని కూడా ఎవరెవరిని నియిమంచుకోవాలనే దానిపై ఎమ్మెల్యేలు ఒక నిర్ణయించుకొని తుది జాబితాను సిద్ధం చేసుకొని సంబంధిత వారికి ఇచ్చినట్లు తెలుస్తుంది. అదే విధంగా యర్రగొండపాలెం, దర్శి నియోజకవర్గంలో వైసీపీకి చెందిన బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, చంద్రశేఖర్ గత ఎన్నికల్లో గెలిచారు. అక్కడ తెలుగుదేశం పార్టీ తరపున ఇన్‌చార్జిలుగా ఉన్న దర్శి నుంచి గొట్టిపాటి లక్ష్మి, యర్రగొండపాలెం నుంచి ఎరిక్షన్‌బాబు ఆయా నియోజకవర్గాల్లో బదిలీలపై జాబితాను సిద్ధం చేసుకొని వారికనుగుణంగా వ్యవహరించే అధికారులను నియమించుకునే అవకాశం ఉన్న నేపథ్యంలో ఆయా నియోజకవర్గాల్లో కూడా బదిలీలు జరగనున్నాయి. మొత్తం మీద కూటమి ప్రభుత్వం ఆశయాలకు అనుగుణంగా పోస్టింగ్‌లు జరిగే అవకాశం లేకపోలేదు. ఇప్పటికే రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం కొలువుతీరి రెండు మాసాలు పూర్తయింది. కొన్ని కారణాల వలన ఇప్పటి వరకు అధికారుల బదిలీలు జరగలేదు. అసెంబ్లీ సమావేశాలు మరో రెండు రోజుల్లో ముగియనున్నాయి. సమావేశం ముగిసిన వెంటనే బదిలీలు జరగనున్నట్లు సమాచారం. ఈ మేరకు తుది జాబితాను సిద్ధం చేసినట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం.

'ప్రకాశం' జిల్లాకు

కేంద్రం నిధులు పెంచాలి

ఎంపీ మాగుంట శ్రీనివాసులు రెడ్డి

విశాలాంధ్ర-ఒంగోలు : ప్రస్తుతం జరుగుతున్న పార్లమెంటు సమావేశాలలో బుధవారం ఒంగోలు పార్లమెంటు సభ్యులు మాగుంట శ్రీనివాసులు రెడ్డి మాట్లాడారు. ఆంధ్రప్రదేశ్‌లోని అమరావతి రాజధానికి, పోలవరానికి ఇతర అభివృద్ధి పనులకు నిధుల మంజూరుతోపాటు, ప్రకాశం జిల్లాతోపాటు తదితర జిల్లాలను వెనుకబడిన జిల్లాల జాబితాలో చేర్చి నిధులు కేటాయించినందుకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి, ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌కి, నిధుల కేటాయింపుకు కృషిచేసిన రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకి కృతజ్ఞతలు తెలిపారు. గుంటూరు, కర్నూలు, నెల్లూరు జిల్లాలలోని వెనుకబడిన ప్రాంతాలతో ప్రకాశం జిల్లాను ఏర్పాటు చేయడంతో అన్ని రంగాలలో ఈ జిల్లా ఇప్పటికీ బాగా వెనుకబడి అభివృద్ధి చెందలేదన్నారు. 12వ లోక్ సభ నుంచి - 26 సంవత్సరాలగా ఈ విషయమై పోరాటం చేస్తున్నానని, ఈ జిల్లాకు ప్రత్యేక నిధులు మంజూరు చేసి అభివృద్ధి పరచవలసినదిగా అటు కేంద్రాన్ని ఇటు రాష్ట్రాన్ని నేను కోరుతున్నానని తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌లోని వెనుకబడిన జిల్లాల అభివృద్ధికి కేవలం 34 కోట్లు మంజూరు చేస్తే, అందులో 49 లక్షలు మాత్రమే ఖర్చు చేయబడిందని, ప్రస్తుతం ప్రకాశం జిల్లా జనాభ విపరీతంగా పెరిగిన దృష్ట్యా, కేంద్ర బడ్జెట్‌లో ప్రకటించిన 50 కోట్లు నిధులు మరీ తక్కువగా వుండి ఏవిధంగాను అభివృద్ధికి సరిపోవని, కనుక నిధులు గణనీయంగా పెంచాలని ప్రణాళిక శాఖ సహాయ మంత్రి రావు ఇంద్రజిత్ సింగ్‌ని మాగుంట శ్రీనివాసులురెడ్డి కోరారు. దానికి మంత్రి సమాధానమిస్తూ ఆకాంక్ష జిల్లాలకు ప్రత్యేకంగా కేంద్రం ఇటువంటి నిధులు ఇవ్వదని, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ పథకాలను అనుసంధానం చేసి నిధులను కూడా కేటాయించటం జరుగుతుందదన్నారు.

ఓడరేవు పిడుగురాళ్ల జాతీయ రహదారి

నిర్మాణంతో జిల్లాకు ప్రయోజనం

- మత్స్య సంపద, వ్యవసాయ ఉత్పత్తుల ఎగుమతికి దోహదం
- జాతీయ రహదారి నిర్మాణానికి రూ.667 కోట్లు విడుదల
- జిల్లా కలెక్టర్ జె.వెంకటమురళి

2లో

విశాలాంధ్ర - బాపట్ల : ఓడరేవు నుంచి పిడుగురాళ్ల వరకు నిర్మించే జాతీయ రహదారితో బాపట్ల జిల్లాకు ఎంతో ప్రయోజనం చేకూరుతుందని జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి చెప్పారు. ఎన్‌హెచ్‌ఏ-167ఏ ఓడరేవు నుంచి పిడుగురాళ్ల జాతీయ రహదారి నిర్మాణ పనులను జిల్లా కలెక్టర్ జె వెంకట మురళి, జిల్లా సంయుక్త కలెక్టర్ బి సుబ్బారావు కలసి బుధవారం క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. ఎన్‌హెచ్ఏ అధికారులతో మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. చీరాల జాతీయ రహదారి మీదుగా వెళ్తున్న జాతీయ రహదారి బ్రిడ్జి నిర్మాణ పనులను పరిశీలించారు. చీరాల ఓడరేవు నుంచి పిడుగురాళ్ల వరకు 47 కిలోమీటర్ల పొడవునా నాలుగు లైన్ల జాతీయ రహదారి నిర్మాణ పనులపై ఆయన ఆరా తీశారు. నూతనంగా నిర్మిస్తున్న జాతీయ రహదారి ప్రణాళిక, మ్యాప్‌లను పరిశీలించారు. టెండర్ దారులు 13 శాతంగా చేపట్టిన నిర్మాణాలను అడిగి తెలుసుకున్నారు.

విధులు లేవు..ఖాళీగా వాలంటీర్లు

- సూపర్ సిక్స్ పథకాలలో తమ పాత్ర ఉంటుందని ఆశ
- స్పష్టతనివ్వని కూటమి ప్రభుత్వం

విశాలాంధ్ర - చీరాల రూరల్ : గత వైసీపీ ప్రభుత్వం ప్రజలకు నవరత్న సంక్షేమ పథకాలను ప్రజలకు చేరువ చేసేందుకు సచివాలయం వ్యవస్థ ఏర్పాటు చేసి వారికి అనుబంధంగా ప్రతి యాభై కుటుంబాలకు ఒక వాలంటీర్ చొప్పున రెండు లక్షల పైచిలుకు మందిని నియమించి వారి ద్వారా సంక్షేమ పథకాలను ప్రజలకు అందించింది. పింఛన్లు, ధృవీకరణ పత్రాలు తదితర సేవలను ప్రజల ఇంటివద్దనే అందేలా చర్యలు తీసుకుంది. దీనితో ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరిగే శ్రమ ప్రజలకు తప్పి ఇంటివద్దనే సేవలు అందుకున్నారు. కోవిడ్ సమయంలో కూడా వాలంటీర్లు క్రియాశీలకంగా పని చేసి ప్రజల మన్ననలు పొందారు. ఎన్నికల పుణ్యమా అని ఎలక్షన్ కమీషన్ ఆదేశాల మేరకు వాలంటీర్లు విధులకు దూరంగా ఉండవలసి వచ్చింది. దీనితో వివిధ కారణాలతో వాలంటీర్లు రాజీనామాలు సమర్పించి అభ్యర్థుల తరపున ప్రచారంలో పాల్గొన్నారు. గత వైకాపా ప్రభుత్వం వాలంటీర్లను నాయకులుగా చేస్తామని పారితోషికంతో పాటు ప్రోత్సాహకాలను అందించింది. తెలుగుదేశం, భారతీయజనతా పార్టీ, జనసేన పార్టీలు కూటమిగా పోటీ చేసి ఎన్నికలకు వెళ్లారు. ప్రచార సమయంలో తెలుగు దేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వాలంటీర్లకు ప్రస్తుతం నెలకు ఇస్తున్న రూ.5000ను పెంచి తమ ప్రభుత్వంలో రూ.10000 ఇస్తామని వారికి హామీ ఇచ్చారు. దీనితో కూటమి ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాల అమలులో తాము కీలక పాత్ర పోషిస్తామని వాలంటీర్లు భావించారు. కానీ అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వం ఇప్పటివరకు వాలంటీర్లపై ఏ నిర్ణయం ప్రకటించలేదు. ఎన్నికల కమిషన్ ఉత్తర్వుల మేరకు ఎన్నికల సమయంలో వాలంటీర్లకు విధులు లేవు. కూటమి అధికారంలోకి వచ్చి రెండు నెలలు కావస్తున్నప్పటికి వారు నిర్వహించవలసిన విధులపై స్పష్టత లేదు. సచివాలయం ఉద్యోగులతో జూలై నెల పింఛన్లను లబ్దిదారుల ఇళ్ల వద్దకే అందించారు. దీనితో వాలంటీర్లు లేకుండానే సేవలు అందిస్తామని ప్రజలకు కూటమి ప్రభుత్వం తెలిపినట్లయ్యింది. జనసేన పార్టీ అధ్యక్షులు కొణిదెల పవన్ కళ్యాణ్ ఎన్నికల ప్రచారంలో వాలంటీర్లపై పలు ఆరోపణలు చేయడం, ప్రస్తుతం డిప్యూటీ చీఫ్ మినిస్టర్‌గా ఉండడం, నూతన ప్రభుత్వంలో కీలకంగా వ్యవహరించడం, వాలంటీర్లకు విధులేమి లేకపోవడంతో వారి భవిష్యత్తు అగమ్యగోచరంగా ఉంది. చీరాల మండలంలో రాజీనామా చేసిన వాలంటీర్లు పోనూ మూడు వందల మందికి పైగా ఇంకా విధుల్లో ఉన్నారు. వాలంటీర్ల వ్యవస్థ కొనసాగనున్నదని శాసనసభలో మంత్రి డోలా శ్రీబాలవీరాంజనేయ స్వామి తెలిపారు. నూతన ప్రభుత్వం వాలంటీర్ల విషయమై ఏం చర్యలను తీసుకుంటుంది, ఏయే బాధ్యతలను అప్పగిస్తుంది అనే విషయంలో స్పష్టత వస్తేనే గందరగోళానికి తెరపడదు.

ప్రభుత్వ ఆదేశాలు అమలు చేస్తాం
- పరిపాలన అధికారి పి.శ్రీనివాసరావు

ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు వాలంటీర్లను విధులకు దూరంగా ఉంచామన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.

గొట్టిపాటి రవిని కలిసిన ఎరిక్షన్ బాబు

విశాలాంధ్ర-యర్రగొండపాలెం : యర్రగొండపాలెం నియోజకవర్గంలోని పలు ప్రాంతాలలో నూతన సబ్ స్టేషన్లు ఏర్పాటు చేయాలని కోరుతూ అమరావతి సచివాలయంలో విద్యుత్ శాఖ మంత్రివర్యులు గొట్టిపాటి రవికి యర్రగొండపాలెం నియోజకవర్గ టీడీపీ ఇంచార్జ్ గూడూరి ఎరిక్షన్ బాబు వినతిపత్రం అందజేసారు. సానుకూలంగా స్పందించిన మంత్రి త్వరలోనే తగు చర్యలు తీసుకొని ప్రణాళిక సిద్ధం చేస్తామని తెలిపారు.

ఢిల్లీ ధర్నాలో పాల్గొన్న అన్నా రాంబాబు

విశాలాంధ్ర-మార్కాపురం : రాష్ట్రంలో టీడీపి నేతలు చేస్తున్న దాడులకు నిరసనగా వైయస్సార్సీపి అధ్యక్షులు వైయస్ జగన్మోహన్రెడ్డి ఆధ్వర్యంలో ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద జరిగిన ధర్నా కార్యక్రమంలో మార్కాపురం వైయస్సార్సీపి ఇన్చార్జి మాజీ ఎమ్మెల్యే అన్నా రాంబాబు ఆధ్వర్యంలో పలువురు నాయకులు పాల్గొన్నారు. ఎన్నికల ఫలితాలప్పటినుంచి రాష్ట్రవ్యాప్తంగా కూటమి నాయకులు వైయస్సార్సీపి నేతలు, కార్యకర్తలను టార్గెట్ చేసి హత్యలు, ఆస్తుల ధ్వంసం, దాడులు లాంటి హింసాత్మక సంఘటనలకు పాల్పడుతున్నందుకు నిరసనగా రాష్ట్రంలో జరుగుతున్న గొడవలను దేశవ్యాప్తంగా ప్రజలకు వివరించేందుకు వైయస్ జగన్మోహన్రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ధర్నాలో అన్నా రాంబాబుతోపాటు గిద్దలూరు వైయస్సార్సీపి ఇన్చార్జి కుందురు నాగార్జునరెడ్డి, మున్సిపల్ ఛైర్మన్ చిర్లంచర్ల బాలమురళీకృష్ణ, కొనకనమిట్ల ఎంపీపీ మురళీకృష్ణయాదవ్, కన్వీనర్ మోరా శంకర్రెడ్డి తదితరులు ధర్నాలో పాల్గొన్నారు.

ఆటో అదుపు తప్పి వ్యక్తి మృతి

విశాలాంధ్ర-సీఎస్పురం : ఆటో అదుపు తప్పి ఆటో డ్రైవర్ మృతి చెందిన సంఘటన బుధవారం జరిగింది. దీనికి సంబంధించిన వివరాలు స్థానిక ఎస్ఐ బి ప్రేమ్కుమార్ కథనం మేరకు సీఎస్పురం మండలం పెదగోగులపల్లి గ్రామానికి చెందిన వేల్పుల చిన్న గురవమ్మ, బైరబోయిన గురమ్మ, గుడిపాటి నాగమ్మ, నాగమ్మ నలుగురు మహిళలు కలిసి తుమ్మగుంటలోని కర్మ కార్యక్రమానికి వెళ్లి తిరిగి వస్తుండగా మార్గమధ్యంలోని అర్చివేముల గ్రామంలో అదుపు తప్పి ఆటో బోల్తా పడింది. దీంతో ఆటో నడుపుతున్న పెదగోగులపల్లి గ్రామానికి చెందిన గుర్రం గురవయ్య (65) అక్కడికక్కడే మృతి చెందాడు. ఆటోలో ఉన్న నలుగురు మహిళలకు స్వల్ప గాయాలు అయ్యాయి. సమాచారం అందుకున్న స్థానిక ఎస్ఐ ప్రేమ్కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మంచి వ్యక్తి పెదగోగులపల్లికి చెందిన ఆటో డ్రైవర్ మృతి చెందడం చాలా బాధాకరమని గ్రామ ప్రజలు విచారం వ్యక్తం చేస్తున్నారు.

పంచాయతీ నిధులు అక్రమాలపై డీఎల్పీఓ విచారణ

విశాలాంధ్ర-టంగుటూరు : మండలంలోని మర్లపాడు గ్రామంలోని పంచాయతీ నిధులు అక్రమాలపై బుధవారం డిఎల్పిఓ గ్రామంలో విచారణ చేపట్టారు. మర్లపాడులోని పైలెట్ ప్రాజెక్టు ద్వారా 2003 నుండి తాగునీటిని సరఫరా చేస్తున్నారు. దాతల సహాయంతోనే ఆర్వో ప్లాంట్ ద్వారా మినరల్ వాటర్ ను ప్రజలకు అందిస్తున్నారు. అయితే పంచాయితీకి ఏమాత్రం సంబంధంలేని వాటర్ ప్లాంట్ నిర్వాహకులు పంచాయితీ నిధులతో కరెంటు బిల్లులు చెల్లించాలని 2014 నుండి 2019 వరకు ఆరు లక్షల రూపాయలు, 2019 నుండి 2023 వరకు 16 లక్షల రూపాయల వరకు పంచాయతీ నిధులను వాటర్ ప్లాంట్ కరెంట్ బిల్లుల కోసం మళ్లించినట్లు బొల్లినేని హరిబాబు జిల్లా ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. విచారణకు డిఎల్పిఓ ఆర్ పద్మ ఈవో ఆర్ డి సాంబయ్యలు గ్రామంలో విచారణ చేపట్టారు. ఒకే రోజు పంచాయితీ నుండి 10 లక్షల 70 వేల రూపాయలు డ్రా చేసి అదే రోజు 10 లక్షల 80000 రూపాయలను కరెంట్ బిల్లు చెల్లించినట్లు బొల్లినేని హరిబాబు ఆరోపించారు. డిఎల్పిఓ ఆర్ పద్మ ఆర్డబ్ల్యూఎస్ అధికారులకు మరియు విద్యుత్ శాఖ అధికారుల తో సంప్రదించి విచారణ చేపట్టి పంచాయితీ నిధులు నెగ్గు తేలుస్తామని తెలిపారు.

అదనపు పొగాకు ఉత్పత్తిపై పెనాల్టీ రద్దు చేయండి : ఎంపీ

విశాలాంధ్ర-ఒంగోలు : బుధవారం ఢిల్లీలో ఒంగోలు పార్లమెంటు సభ్యులు మాగుంట శ్రీనివాసులురెడ్డి కేంద్ర వాణిజ్య శాఖా మంత్రి పీయూష్ గోయల్ని పార్లమెంటు భవనంలో టి.డి.పి. పార్లమెంటరీ పార్టీ నాయకులు మరియు నరసరావుపేట యం.పి. లావు శ్రీకృష్ణదేవరాయలుతో మరియు బి.జె.పి. రాష్ట్ర అధ్యక్షురాలు - రాజమండ్రి యం.పి., దగ్గుబాటి పురంధేశ్వరితో కలసి అదనపు పొగాకుపై పెనాల్టీ రద్దు గురించి మాట్లాడారు. ఈ సంవత్సరం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ముఖ్యంగా వాతావరణ పరిస్థితులు బాగా అనుకూలించడంతో పొగాకు పంట ఉత్పత్తి అధికంగా జరిగినదని, గతంలో కూడా కేంద్రం పొగాకుపై పెనాల్టీని పూర్తిగా తీసివేసి కొనుగోలుచేసిందని, ఈ ఏడాది కూడా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో పొగాకు రైతులు అదనంగా పండించిన పొగాకు పంటపై పెనాల్టీని పూర్తిగా తీసివేసి కొనుగోలు చేయుటకు చర్యలు తీసుకోవలసినదిగా కోరినారు. దానిపై కేంద్ర మంత్రి వెంటనే స్పందించి పెనాల్టీ రద్దు విషయమై ఈ రోజే అధికారులతో మాట్లాడి నిర్ణయం తీసుకుంటానని తెలియజేశారు.

అయ్యంకి వెంకటరమణయ్య జయంతి

విశాలాంధ్ర-టంగుటూరు : శాఖా గ్రంథాలయం టంగుటూరు ఆధ్వర్యంలో గ్రంథాలయాల పితామహుడు పద్మశ్రీ అవార్డు గ్రహీత వెంకటరమణయ్య 134వ జయంతి నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆయుర్వేద డాక్టర్ ప్రియాంక హాజరయ్యారు. వారు మాట్లాడుతూ ఎంతోమంది విజ్ఞానవంతులుగా తీర్చిదిద్దడంలో నాటినుండి నేటి వరకు గ్రంథాలయాల పాత్ర ఉందని అలాంటి గ్రంథాలయాలను స్థాపించిన అయ్యంకి వెంకటరమణయ్య చిరస్మరణీయుడని కొనియాడారు. ఈ కార్యక్రమంలో టంగుటూరు వీఆర్వో ఏ శ్రీహరి కే జాన్ బాబు కే సింగయ్య ఎస్ మోహన్ రావు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

శారీరక మానసిక వికాసాభివృద్ధికి క్రీడలే ప్రాధాన్యం

విశాలాంధ్ర-యర్రగొండపాలెం :

మండలంలో శిక్షా సప్తాహ (విద్యా వారోత్సవాలు)లో భాగంగా 3వ రోజు క్రీడాదినోత్సవం అత్యంత ఉత్సాహంగా నిర్వహించినట్లు ఎంఇఓ పి ఆంజనేయులు తెలిపారు. బుధవారం యర్రగొండపాలెం నందు ఎచ్ఎమ్ రమాదేవి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా హాజరై కార్యక్రమాలు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంఇఓ మాట్లాడుతూ క్రీడలు, వ్యాయామం శరీరక ధృఢత్వానికే గాక మానసిక పరిపక్వత, మానసికాభివృద్ధికి దోహదం చేస్తాయన్నారు. పాఠశాల వయస్సులో ఆటలు ఆడేవారికి అనారోగ్యం దరిచేరదనీ, ఇమ్యూనిటీ శక్తి కూడా పెరుగుతుందన్నారు. క్రీడలు కేవలం పతకాలకోసమే కాకుండా, ఆరోగ్యాన్ని పెంచు కోవటానికని ప్రతీ ఒక్కరూ తెలుసుకోవాలన్నారు.

చిన్న వయసు నుంచే విద్యార్థులకు క్రీడలు అలవాటు చేయటం ద్వారా వారికి క్రమశిక్షణతో పాటు నాయకత్వ నైపుణ్యాలను అభివృద్ధి చెందించవచ్చన్నారు. ఎచ్ఎమ్ రమాదేవి మాట్లాడుతూ మన పాఠశాలలో వ్యాయామ ఉపాధ్యాయులు వున్నారనీ క్రీడలకు కేటాయించిన సమయాలలో తప్పక విద్యార్థులందరూ ఆటలు ఆడుకోవాలన్నారు. క్రీడలలో భాగంగా యోగా, ధ్యానం మానసిక పరిపక్వతకు దోహదం చేస్తాయని ప్రతీ విద్యార్థి రోజులో కొంత సమయం క్రీడా ప్రాంగణంలో గడపాలని తెలిపారు. ఎంఇఓ2 మల్లానాయక్ ఎంపీపీఎస్ అంబేద్కర్ నగర్ పాఠశాలలో విద్యార్థులతో కలసి క్రీడాకార్యక్రమాలు నిర్వహించారు. విద్యార్థులకు క్రీడల యొక్క ఉపయోగాలు తెలియచేసి, ప్రతీ పాఠశాలలో కూడా చిన్న పిల్లలని పక్కన పెట్టకుండా రోజులో కొంత సమయం క్రీడలకం కేటాయించాలన్నారు. పాఠశాలలలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో చెన్నకేశవులు, మాథ్యూస్, సత్యనారాయణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఓడరేవు పిడుగురాళ్ల జాతీయ రహదారి నిర్మాణంతో జిల్లాకు ప్రయోజనం

విశాలాంధ్ర - బాపట్ల : ఓడరేవు నుంచి పిడుగురాళ్ల వరకు నిర్మించే జాతీయ రహదారితో బాపట్ల జిల్లాకు ఎంతో ప్రయోజనం చేకూరుతుందని జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి చెప్పారు. ఎన్హెచ్ఏ-167ఏ ఓడరేవు నుంచి పిడుగురాళ్ల జాతీయ రహదారి నిర్మాణ పనులను జిల్లా కలెక్టర్ జె వెంకట మురళి, జిల్లా సంయుక్త కలెక్టర్ బి సుబ్బారావు కలసి బుధవారం క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. ఎన్హెచ్ఏ అధికారులతో మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. తదుపరి పర్చూరు మండలానికి చేరుకున్నారు. ప్రధాన పంట కాలువ మీదుగా వెళ్తున్న జాతీయ రహదారి, మేజర్ బ్రిడ్జి నిర్మాణ పనులను పరిశీలించారు. మత్స్య సంపద, వ్యవసాయ ఉత్పత్తులను ఎగుమతి చేయడానికి నిర్మాణంలో ఉన్న జాతీయ రహదారి ఎంతో కీలకంగా మారనుందని జిల్లా కలెక్టర్ చెప్పారు. ఓడరేవు నుంచి పిడుగురాళ్ల వరకు నూతనంగా నిర్మించే ఎన్ హెచ్ ఏ-167ఏ జాతీయ రహదారికి రూ.667 కోట్లు నిధులు విడుదలయ్యాయన్నారు. చీరాల మండలం ఓడరేవు వద్ద మొదలయ్యే జాతీయ రహదారి పర్చూరు వరకు సాగుతుందన్నారు. 35 కిలోమీటర్ల మేర బాపట్ల జిల్లాలోనే రహదారి నిర్మాణం జరుగుతుందన్నారు. రహదారి నిర్మాణం కొరకు 103 హెక్టార్ల భూమి అవసరం కానుందన్నారు. 22.30 హెక్టార్ల భూమి ప్రభుత్వానికి చెందినది కాగా, మిగిలిన 82.70 హెక్టార్లను భూ సేకరణ చేయాల్సి ఉందన్నారు. నాలుగు లైన్లతో నిర్మించే జాతీయ రహదారి 24 మీటర్ల వెడల్పు ఉంటుందని చెప్పారు. జిల్లాలో నుంచి వెళ్లే ఈ రహదారి 2025 డిసెంబర్ నెల చివరి నాటికి పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. నాలుగు మేజర్ బ్రిడ్జిలు, ఆరు అండర్ పాస్‌లు ఉండేలా ప్రణాళికతో నిర్మిస్తున్నట్లు చెప్పారు. జాతీయ రహదారి నిర్మాణ పనులలో నాణ్యతలో రాజీ పడరాదని ఎన్హెచ్ఏ ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. ఓడరేవు నుంచి వచ్చే సముద్రంలోని మత్స్య సంపద విక్రయాలు ఇకనుంచి మరింతగా పెరుగుతాయన్నారు. వ్యవసాయంపై ఆధారపడిన బాపట్ల జిల్లాలోని వ్యవసాయ ఉత్పత్తులను ఎగుమతి చేయడానికి మార్గం సుగుమం అవుతుందన్నారు. ఆయన వెంట బాపట్ల, చీరాల ఆర్డీఓలు జి రవీందర్, జి సూర్యనారాయణరెడ్డి పాల్గొన్నారు.

ఎరుపు, రాగి రంగు మచ్చలున్నవారిని గుర్తించాలి

విశాలాంధ్ర-ముండ్లమూరు : గ్రామాలలో ప్రతి ఇంటికి తిరిగి ప్రతి ఒక్కరిని పరిశీలించి ఎరుపు లేదా రంగు మచ్చలున్న వారిని గుర్తించాలని దర్శి డివిజన్ డిపిఎంఓ నలమలపు వెంకటసుబ్బారెడ్డి అన్నారు. మండల కేంద్రమైన ముండ్ల మూరులో బుధవారం ప్రతి ఇంటికి తిరిగి కుష్టు వ్యాధిపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ చర్మంపై స్పర్శ లేని రాగిరంగు మచ్చలు ఉన్న వారిని గుర్తించడం జరిగిందన్నారు. చెవులపై, ఎదపై, నొప్పిలేని బుడిపెలు, కనుబొమ్మలు, మరియు కనురెప్పల వెంట్రుక లు రాలిపోవడం, ముక్కులు నుండి రక్తం కారడం, కాళ్లు చేతులు తిమ్మిర్లు, లేక జో ములు కలిగి ఉండటం, అరచేతులు, అరికాళ్ళు స్పర్శ కోల్పోవడం, చల్లని లేదా వేడి వస్తువులను గుర్తించలేకపోవడం, తెలియకుండానే చేతులు కాళ్లలో బొబ్బలు రావడం జరుగుతుంటే కుష్టు వ్యాధి లక్షణాలు ఉన్నట్లేనని, అలాంటివారు ఎవరైనా ఉన్నట్లయితే మీ దగ్గరలో ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు వచ్చి వైద్యాధికారులను సంప్రదించి ఆరోగ్య సేవలు పొందాలన్నారు. గ్రామంలో ఐదుగురుని గుర్తించడం జరిగిందని వారిలో ఒకరిని నిర్ధారణ చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్ ఈ కన్యా కుమారి, ఏఎన్ఎం ప్రభావతి, ఆషాలు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

విశాలాంధ్ర-ముండ్లమూరు : గ్రామాలలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు చేపట్టాలని జిల్లా డిప్యూటీ డిఎంఅండ్ హెచ్ఓ డాక్టర్ మాధవి లత, జిల్లా న్యూక్లియర్ మెడికల్ అధికారిని డాక్టర్ శ్రీవాణి సూచించారు. మండల కేంద్రమైన ముండ్లమూరులోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని బుధవారం సందర్శించారు. ముందుగా రికార్డులు పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. వారు మాట్లాడుతూ ప్రస్తుతం వర్షాలు కురుస్తున్నందున డెంగ్యూ, డయేరియా, మలేరియా, టైఫాయిడ్ వంటివి ప్రబలే అవకాశం ఉందన్నారు. గ్రామాల్లో పారిశుద్ధ్య నిర్వహణ పక్కాగా చేపట్టాలన్నారు. రక్షిత మంచినీటి పథకాల ట్యాంకును క్లోరినేషన్ చేయా లన్నారు. ఎప్పటికప్పుడు పరీక్షించాలని వివరించారు. అన్ని రకాల వ్యాధులు నివారణకు అవసరమైన మందులను సిద్ధం చేసి ఉంచుకోవాలని పీహెచ్సీ వైద్యాధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో వైద్య అధికారిని ఎం జాస్మిన్, జె వెంకటేశ్వర రెడ్డి, హెచ్ వి కన్యాకుమారి, శారద, మాధవి, యుగంధర్, నాగార్జున, ప్రసాద్, స్మైలీ, తదితరులు పాల్గొన్నారు.

పండ్ల తోటలపై అవగాహన

విశాలాంధ్ర-దొనకొండ: తోటలు సాగు చేసే రైతులకు ఉచితంగా పండ్ల మొక్కలు అందజేస్తామని ఏపిఎంబిపీ ప్రాజెక్టు డైరెక్టర్ రమణ తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో భాగంగా రైతులకు పూలు, పండ్ల తోటల సాగుపై అవగాహన కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ 5 ఎకరాల్లోపు పొలం ఉన్న రైతులకు ఉచితంగా గులాభి, మల్లె, మామిడి, జామ, తైవాన్ జామ, డ్రాగన్, సీతాఫలం పండ్ల మొక్కలు అందజేస్తున్నామని, కావాల్సిన వారు చిన్న సన్నకారు రైతు సర్టిఫికెట్, పొలం పాసు పుస్తకం, 1బి, ఆధార్, బ్యాంక్ ఖాతా నకళ్లతో వారంలోగా ఉపాధి కార్యాలయంను సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ వి.వసంత రావునాయక్, అగ్రికల్చర్ అధికారి ఆర్.రమేష్, డ్వామా కోర్సు డైరెక్టర్ శ్యాంసన్, ఏపీఓ తగరం దేవయ్య, కోఆర్డినేటర్లు, టెక్నికల్ అసిస్టెంట్లు, రైతులు పాల్గొన్నారు.

నిగ్గు తేల్చరే..?

- పొదుపు రుణాల గోల్‌మాల్‌పై స్పందన కరువు
- ప్రభుత్వం మారిన పట్టించుకోని అధికారులు
- మంత్రి స్వామి నియోజకవర్గంలోనే ఏపీఎంకు ఆశ్రయం
- ఇదేం చోద్యమని ప్రశ్నిస్తున్న ఒమ్మెవరం పొదుపు మహిళలు

విశాలాంధ్ర-నాగులుప్పలపాడు : మండలంలోని ఒమ్మెవరం గ్రామంలో పొదుపు రుణాల అక్రమాలపై నిగ్గు తేల్చడంలో అధికారులు మీనమేషాలు లెక్కిస్తున్నారని ఆరోపణలు వస్తున్నాయి. వీవోఏ అనిత, ఆమె కుమారులు కోట వంశీకృష్ణ, నితిన్లపై స్థానిక పోలీసు స్టేషన్లలో కేసు నమోదైంది. కేసులకు భయపడి నిందితులు కొంతకాలం పరారీలో ఉన్నారు. ఆ విచారణ జరుగుతున్న నేపథ్యంలో ఆమె మృతిచెందింది. దీంతో ఆమె కుమారులు పోలీసు స్టేషన్లోనే లొంగిపోయారు. పోలీసుల రక్షణలో గ్రామంలో అంత్యక్రియలను నిర్వహించారు. అయితే నిందితులు దొరికినప్పటికీ, పోలీసులు మాత్రం ఈ కేసులో సమగ్ర విచారణ చేపట్టడం లేదు. ఇక ఈ అక్రమాల్లో వెలుగు సీసీ, నాటి ఏపీఎంల పాత్రతో పాటు బ్యాంకు సిబ్బంది పాత్ర కూడా ఉందనే ఆరోపణలున్నాయి. ఇదే విషయాన్ని ప్రధాన నిందితులైన కోట వంశీ, నితిన్లు గ్రామంలోని పలువురు పొదుపు మహిళలకు తెలియజేసినట్లు తెలిసింది. అయితే ప్రధాన నిందితులను విచారిస్తే వీరి పాత్ర కూడా బయటపడే అవకాశం ఉంది. అయితే ఈ కేసులో వారిని విచారించకుండా అక్రమాలకు పాల్పడ్డ అధికారులు అడ్డుకుంటున్నట్లు సమాచారం.

ముందే గ్రామస్థులు ఫిర్యాదు చేసినా :

ఈ అక్రమాల్లో నాటి వెలుగు ఏపీఎం రవికుమార్, సీసీ కవిత, ఉప్పుగుండూరు యూనియన్ బ్యాంకులోని ఓ ఉద్యోగి పాత్ర కూడా ఉందని గతంలోనే పోలీసులకు ఫిర్యాదు చేశారు. అయితే నాటి ఎస్సై ఉయ్యాల హరిబాబు. కేసును సమగ్రంగా విచారించి బాధ్యులైన అధికారుల పేర్లు ఈ కేసులో చేరుస్తామన్నారు. నేటి వరకు దీనిపై పోలీసులు విచారించలేదు. హరిబాబు బదిలీ అయిన తర్వాత విధుల్లోకి వచ్చిన బ్రహ్మనాయుడు కూడా ఈ కేసు గురించి పెద్దగా పట్టించుకోలేదు. ఎన్నికల అనంతరం ఫాలో చేస్తామని చెప్పినా, ఆయన పట్టించుకోవడం లేదు. ఇక గ్రామస్థుల నుంచి కూడా ఎవరికి వారిగా ఫిర్యాదు చేద్దామన్నా, పోలీసులు ఫిర్యాదు స్వీకరించలేదు. ఒకే ఫిర్యాదు తీసుకొని అదే గ్రామం మొత్తానికి సరిపోతుందని పోలీసులు తెలిపారు. దీంతో బాధిత మహిళలు ఒక్కరిగా ఎక్కడికి పోవాలో అర్థంకాని పరిస్థితి నెలకొంది. పోలీసుశాఖ కూడా ఉద్దేశ్య పూర్వకంగా ఈ కేసును తొక్కిపెట్టిందనే ఆరోపణలున్నాయి. జిల్లాకు కొత్తగా ఎస్పీగా వచ్చిన దామోదర్ అయినా ఈ కేసుపై ప్రత్యేక దృష్టి సారించాలని స్థానికులు కోరుతున్నారు.

ఏం చేయాలి :

ఇప్పటికే పోలీసులు ఈ అక్రమాలపై కేసు నమోదు చేశారు. ప్రధాన నిందితులైన కోట వంశీకృష్ణ, నితిన్లు విచారించాలి. వీరు ఎంత వసూలు చేసిది నిగ్గు తేల్చి ఆ సొమ్మును రికవరీ చేయాలి. వారి స్టేట్మెంట్ను నమోదు చేయాలి. వీరితో అక్రమంగా భాగస్వాములైన అధికారులపై కూడా కేసు నమోదు చేసి నిధుల రికవరీకి ఆదేశించాలి. రుణాల రికవరీలో స్త్రీనిధి మేనేజర్, జిల్లా విచారణ అధికారులు కూడా కలగజేసుకోవాలి. నిందితులు పరారీలో ఉన్న సమయంలో రెండురోజులు చుట్టపు చూపుగా వచ్చిన అధికారులు ఇప్పుడు మాత్రం రికవరీకి రాకపోవడం గమనార్హం. వీరి కనుసన్నల్లోనే జిల్లా వ్యాప్తంగా ఇలాంటి అక్రమాలు జరుగుతున్నాయా..? అన్న అభియోగాలు లేకపోలేదు. ఇలాంటి రుణ అక్రమాలపై సీఎం చంద్రబాబునాయుడి దృష్టికి కూడా పలువురు మహిళలు రాష్ట్ర వ్యాప్తంగా తీసుకుపోతున్నారు.

మంత్రి ఇలాకాలోనే ఏపీఎం :

ఈ అక్రమాలు జరిగిన సమయంలో ఏపీఎంగా ఉన్న రవికుమార్‌పై పెద్ద ఎత్తున ఆరోపణలున్నాయి. ఈ అక్రమాలు వెలుగు చూసిన వెంటనే ఆయన తన పరపతితో సింగరాయకొండకు బదిలీ అయ్యారు. ఈయన బదిలి అప్పట్లో పెద్ద రాజకీయ చర్చ నడిచింది. గతంలో వీరాలలో పనిచేసిన సమయంలోనూ ఈయన చేసిన అక్రమాలపై విచారిస్తున్నట్లు సమాచారం. ఈయనపై ఇన్ని ఆరోపణలున్నా... సాక్షాత్తు సంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి ప్రాతినిధ్యం వహిస్తున్న కొండపి నియోజక వర్గంలోని సింగరాయకొండలోనే ఆయన విధులు నిర్వర్తించడం గమనార్హం.

ప్రభుత్వ పథకాలకు కౌలు కార్డులు

ఏడీఏ బాలాజీ నాయక్

విశాలాంధ్ర-దొనకొండ: గ్రామాల్లో కౌలు రైతులు ప్రభుత్వ పథకాలు పొందాలంటే తప్పక కౌలు కార్డులు పొందాలని దర్శి వ్యవసాయ సహాయ సంచాలకులు కె.బాలాజీ నాయక్ తెలిపారు. మండలంలోని పోలేపల్లి గ్రామంలో ఏఓ లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో జరిగిన కౌలు కార్డుల అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ ఇతరుల వద్ద పొలం కౌలుకు తీసుకున్న రైతులకు సీసీఆర్సీ కార్డులు మంజూరు చేసేందుకు భూ యజమాని ఆధార్, పొలం 1బి, రైతు ఆధార్ నకలు పత్రాలతో సంబంధిత సచివాలయ రెవెన్యూ అధికారిని సంప్రదించాలన్నారు. ఈ ఏడాది మండలంలో 1023 కార్డులు ఇవ్వాలనే లక్ష్యంగా పని చేస్తున్నట్లు తెలిపారు. కౌలు కార్డుల వలన పంట నమోదు, పంట నష్టం, రైతు భరోసా, కొనుగోలు కేంద్రాల్లో పంట అమ్ముకునేందుకు, పంట రుణం పొందేందుకు ఉపయోగంగా ఉంటు ందన్నారు. దరఖాస్తు చేసుకున్న 3 రోజుల్లో కార్డులు ఇస్తామన్నారు. మండలంలోని కౌలు రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసు కోవా లన్నారు. కార్యక్రమంలో ఏఓ ఎన్.లక్ష్మీనారాయణ, వీఆర్ఓ ఆర్ గాలయ్య, కార్యదర్శి రామాంజనేయరెడ్డి, సహాయకులు వీరాంజనేయులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి క్రీడలకు జడ్పీహెచ్ఎస్ విద్యార్థులు ఎంపిక

విశాలాంధ్ర-దొనకొండ: ఈ నెల 25 నుండి 28 వరకు హర్యానా రాష్ట్రంలోని ఖరక్ పట్టణంలో జరుగు జాతీయ స్థాయి నెట్‌బాల్ పోటీలకు స్థానిక జడ్‌పీ పాఠశాల 10వ తరగతి విద్యార్థులు జి.కోటేష్, ఎంవి సంజన ఎంపికయ్యారు. ఈ నెల 21వ తేది శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా బుచ్చిరెడ్డిపాలెంలో నెట్‌బాల్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ వారు నిర్వహించిన ఎంపికలో వ్యాయామ ఉపాధ్యాయులు కాలే నరసింహారావు ప్రోత్సాహంతో పాల్గొన్న వీరిరువురు ప్రతిభ కనబరచి ఆంధ్రప్రదేశ్ జట్టుకు ఎంపికయ్యారు. వారిని ప్రధానోపాధ్యాయులు వివి రామాంజనేయులు, కాలే నరసింహారావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు వారిని అభినందించారు.

కౌలు కార్డు తప్పనిసరి : ఏవో రమేష్ బాబు

విశాలాంధ్ర-నాగులుప్పలపాడు : ప్రభుత్వం అందించే సబ్సిడీలు పొందాలంటే రైతుకు కౌలు కార్డు తప్పనిసరి అని వ్యవసాయ శాఖ అధికారి రమేష్ బాబు సూచించారు. బుధవారం మండల పరిధిలోని రాచవారిపాలెం గ్రామంలో కౌలు రైతుల గ్రామసభను మండల వ్యవసాయ శాఖ వారి ఆధ్వర్యంలో నిర్వహించటం జరిగింది. సమా వేశానికి ముఖ్య అతిథులుగా జిల్లా వ్యవసాయ అధికారి ఎస్ శ్రీనివాసరావు మరియు ఒంగోలు సహాయ వ్యవసాయ సంచాలకులు బి రమేష్ హాజరైనారు. ఈ సందర్భంగా జిల్లా

వ్యవసాయ అధికారి ఎస్ శ్రీనివాసరావు మాట్లాడుతూ భూములను కవులు చేసుకునే రైతులందరూ తప్పనిసరిగా వ్యవసాయ, రెవెన్యూ శాఖ వారి ద్వారా కౌలు కార్డులు పొందా లని తెలిపారు. కాబట్టి కౌలు రైతులందరూ తప్పనిసరిగా కౌలు కార్డులను పొందా లని తెలిపారు. ఒంగోలు సహాయ వ్యవసాయ సంచాలకులు బి రమేష్ మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్లో సాగు చేసినటువంటి రైతులు మరియు రబి సీజన్లో సాగు చేసేటువంటి రైతులు కూడా కౌలు కార్డులు పొందాలని సన్నా చిన్న కారు రైతులు ముఖ్యంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు చెందినటు వంటి కౌలు రైతులకు ప్రభుత్వం ద్వారా వచ్చేటు వంటి రాయితీ లు కూడా ఈ కౌలు కార్డు ద్వారా పొందవచ్చని తెలిపారు. అనంతరం కౌర రైతులకు వీఆర్ఓ ద్వారా పదిమందికి కౌలు కార్డులు పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి కె రమేష్ బాబు ఏఈఓ పి శేషయ్య వివిఎ చాందిని రాచవరిపాలెం గ్రామ రైతులు పాల్గొన్నారు.

మహాకవి గుర్రం జాషువాకు ఘన నివాళి

విశాలాంధ్ర-దర్శి : రాష్ట్ర దళిత సేన ప్రజా సంఘాల నాయకులు స్థానిక ఎంపీడీవో ఆఫీస్ ఆవరణంలో రాష్ట్ర దళిత సేన ప్రజా సంఘాల ఆధ్వర్యంలో రాచపూడి మోషె అధ్యక్షతన గుర్రం జాషువా 53వ వర్ధంతి సభ జరిగింది. ముఖ్య అతిథులుగా ఎఆర్ఎస్ శాస్త్రవేత్త వరప్రసాద్ మాట్లాడుతూ సమ సమాజం కోసం గుర్రం జాషువా రచించిన పద్యాలు సమాజాన్ని మేలుకొలిపయా న్ని ఆయన కొనియాడారు ముందుగా చిత్రపటానికి దళిత ప్రజా సంఘాలనాయకులు పూలమాలేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలోరాష్ట్రదళిత సేన,ప్రజాసంఘాలు రాచపూడి మోస, గర్నెపూడి ప్రేమ్ కుమార్, గోవింద్ ప్రసాద్ పాలిపోగు డక్లెస్ జీవి రత్నం గంధం ఇర్మియ, జనరల్ పల్లి జోసెఫ్ కావున నాగమణి, మల్లెల జాన్ ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

అయ్యంకి వెంకట రమణయ్య జయంతి

విశాలాంధ్ర-పెద్దదోర్నాల : స్థానిక శాఖా గ్రంథాలయం దోర్నాల గ్రంథాలయ పితామహుడు శ్రీ శ్రీ అయ్యంకి వెంకట రమణయ్య 134వ జయంతి కార్యక్రమంను స్థానిక గ్రంథాలయంలో బుధవారం గ్రంథ పాలకుడు వెంకటేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో జయంతి కార్యక్రమాలు నిర్వహించారు. ముందుగా శ్రీశ్రీ అయ్యంకి వెంకటరమణయ్య చిత్రపట మునకు లక్ష్మణ్ నాయక్ వెల్ఫేర్ అసిస్టెంట్, చేత పూలమాల వేయించడం జరిగింది.తదుపరి విద్యార్థినీ విద్యార్థులకు అయ్యంకి వెంకటరమణయ్య గ్రంథాలయ ఉద్యమంలో వారు చేసినటువంటి సేవల గురించి గ్రంథ పాలకుడు డివి సుబ్బారెడ్డి కె లక్ష్మణ్ నాయక్ వెల్ఫేర్ అసిస్టెంట్, డి రంగనాయకులు, ఫిషర్ అసిస్టెంట్ వెల్ఫేర్ అయ్యంకి వెంకటరమణయ్య గురించి విద్యార్థిని విద్యార్థులకు చెప్పడం జరిగింది. తదుపరి గ్రంథపాలకుడు డివి సుబ్బారెడ్డి వందన సమర్పణముతో ఈ కార్యక్రమము ముగించడం జరిగింది.

నరసాపురం ఎంపీడీఓ మృతికి సంతాపం

విశాలాంధ్ర-పామూరు : ఏలూరు జిల్లా నరసాపురం ఎంపీడీవో వెంకట రమణారావు విషాదకర అకాల మరణానికి చింతిస్తూ పామూరు ఎంపీడీవో కార్యాలయం సంతాపం వ్యక్తం చేసింది. బుధవారం మండల ప్రజా పరిషత్‌లో ఎంపీడీవో వెంకటరమణారావు చిత్రపటానికి నివాళు లర్పిస్తూ రెండు నిమిషాలు మౌనం పాటించారు. వెంకటరమణారావు కుటుంబానికి ఈ విషాదాన్ని తట్టుకునే మానసిక స్థైర్యం ఇవ్వాలని కోరుకున్నారు. మరణం మీద దర్యాప్తు జరిపి దోషులను కఠినంగా శిక్షించాలని తద్వారా ప్రభుత్వ ఉద్యోగులకు ఒత్తిళ్ల నుండి భరోసా కల్పించాలని ఎంపీడీవో పుట్టారెడ్డి డిమాండ్ చేశారు.

ప్రతి విద్యార్థి ఒత్తిడికి గురికావద్దు

ఎంఈఓ జింకా వెంకటేశ్వర్లు

విశాలాంధ్ర-గిద్దలూరు : మండలంలోని ముల్లపాడు గ్రామంలో భద్రయ్య మెమోరియల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నందు ఆర్ట్ ఆఫ్ లివింగ్ ఆధ్వర్యంలో విద్యార్థిని విద్యార్థులకు మూడు రోజులపాటు యూత్ ఎంపవర్ సెమినార్స్ శిక్షణ బుధవారంతో ముగిసింది. ముఖ్య అతిథులుగా గిద్దలూరు మండల ఎంఈఓ జింకా వెంకటేశ్వర్లు హాజరై మాట్లాడుతూ రవిశంకర్ గురూజీ శిష్యులు నేర్పించిన విద్య వల్ల ఒత్తిడికి లోను కాకుండా ఉండే ప్రక్రియలు చిన్నపిల్లలు అయిన మీకు చాలా బాగా ఉపయోగపడి వ్యక్తిత్వ వికాసానికి ఉపయోగ పడతాయన్నారు. చిన్న వయసులో సుదర్శన క్రియ చేయడం వల్ల మానసికంగా ప్రశాంతంగా ఒత్తిడిని అధిగమించి ఎల్లప్పుడూ ఆనందంలో ఉండే ప్రక్రియలు మీరు పొందారన్నారు ఈ కార్య క్రమంలో ప్రధానోపాధ్యాయురాలు కొండా లక్ష్మీదేవి పాలుగుళ్ల పురుషోత్తం రెడ్డి సాయికిరణ్ మనోహర్ రెడ్డి బిందు ప్రవీణ్ చెన్నారెడ్డి బి యస్ నారాయణరెడ్డి సంఘసేవకులు పాల్గొన్నారు.

కేంద్ర బడ్జెట్లో రాష్ట్రానికి పెద్ద పీట

డాక్టర్ గొట్టిపాటి లక్ష్మీ

విశాలాంధ్ర-దర్శి : ఆంధ్ర ప్రజల ఆకాంక్షలను అనుగుణంగా కేంద్ర బడ్జెట్ ఇది. కూటమి ప్రభుత్వ చిత్తశుద్ధి అని డాక్టర్ గొట్టిపాటి లక్ష్మీ అన్నారు. రాజధాని అమరావతి అభివృద్ధికి రూ.15 వేల కోట్లు ప్రత్యేక సాయం అవసరాన్ని బట్టి భవిష్యత్తులో అమరావతికి మరిన్ని అదనపు నిధులు ఏపీ విభజన చట్టానికి అనుగుణంగా పోలవరం సత్వర నిర్మాణానికి సంపూర్ణ సాయం పోలవరానికి కావాల్సిన నిధులు కేటాయింపు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం, రైతులకు జీవనాడి పోలవరం భారత ఆహార భద్రతకు పోలవరం ఎంతో కీలకమైంది. ఆంధ్రప్రదేశ్ విభజన చట్టం ప్రకారం పారిశ్రామికాభివృద్ధికి ప్రత్యేక సహకారం విశాఖ-చెన్నై పారిశ్రామిక కారిడార్‌లోని రోడ్‌లకు ప్రత్యేక సాయం హైదరాబాద్-బెంగళూరు పారిశ్రామిక కారిడార్ అభివృద్ధికి ప్రత్యేక నిధులు కొప్పర్తి, ఓర్వకల్లు పారిశ్రామిక కేంద్రాలకు నీళ్ళు, విద్యుత్, రోడ్లు, హైవేల అభివృద్ధికి నిధులు కేంద్ర బడ్జెట్లో వెనకబడిన జిల్లాల అభివృద్ధిలో మన ప్రకాశం జిల్లా ఉండడం మన అభివృద్ధికి మైలురాయిగా చెప్పవచ్చని గొట్టిపాటి లక్ష్మీ అన్నారు. కేంద్ర నిధులతో ప్రకాశం జిల్లా అభివృద్ధి చేసుకోవచ్చు రూపు రేఖలు మారబోతున్నాయి. ప్రకాశం జిల్లాలో ఉన్న దర్శి ప్రాంతం కూడా ఉండడం కేంద్ర బడ్జెట్‌లో నిధులు కేటాయించడం మనకు శుభ పరిణామంగా చెప్పవచ్చు. మన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ప్రధాన మంత్రి మోడీ ఒప్పించి ప్రకాశం జిల్లా ను వెనుకబడిన జిల్లా జాబితాలో చేర్చి అభివృద్ధికి బాటలు వేయడం మనందరి అదృష్టంగా భావించవచ్చు అన్నారు. కేంద్ర నిధులతో మన ఎంపీ మాగుంట శ్రీనివాస్ రెడ్డి సహకారంతో రాబోయే రోజుల్లో దర్శి ప్రాంతాన్ని అభివృద్ధి ప్రాంతంగా మార్చుకుందాం ఈ కార్యక్రమం పలువురు టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

కౌలు రైతులకు సీసీఆర్సీ కార్డులు వినియోగించాలి

విశాలాంధ్ర-ముండ్లమూరు : మండలంలోని ఉమామహేశ్వరపురం, తమ్మలూరు గ్రామాలలోని రైతు సేవా కేంద్రాలలో బుధవారం రెవెన్యూ శాఖ, వ్యవసాయ శాఖ సంయుక్తంగా కౌలు రైతు గుర్తింపు కార్డులపై రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వ్యవసాయ అధికారి మహమ్మద్ ఫరూక్ మాట్లాడుతూ కౌలు రైతులు భూ యజమానుల ద్వారా ఒప్పందం కుదుర్చుకొని కౌలు రైతుల కార్డులకు ధ్రువీకరణ పత్రాలు వీఆర్వోల ద్వారా పొందవచ్చు అని తెలిపారు. కౌలు రైతులకు 11 నెలలపాటు భూమి మీద హక్కు ఉంటుందని, తర్వాత హక్కు ఉండదని తెలిపారు. సాగు చేసిన పంటకు మాత్రమే హక్కు ఉంటుందని అన్నారు. కౌలు సమయంలో పంట నష్టపోతే నష్టపరిహారం అందుతుందన్నారు. కౌలు రైతులకు పంటల బీమా వర్తిస్తుందని, బ్యాంకుల ద్వారా పంట రుణాలు తీసుకోవచ్చని తెలిపారు. ఈ గ్రామ సభలో ఉమామహేశ్వరపురంలో ఏడు మంది రైతులు, తమ్మలూరు గ్రామంలో 9 మంది రైతులు కౌలు దరఖాస్తులు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో వీఆర్వో చల్లా బ్రహ్మ తేజ, కావూరి దయానందం, వీ ఏ ఏ డి రాము, టి వీరాంజమ్మ, బాల వెంకటయ్య, అబ్దుల్ రజాక్, రైతులు పాల్గొన్నారు.

పొగాకు లద్దె పురుగులపై రైతులు అప్రమత్తంగా ఉండాలి

విశాలాంధ్ర-ముండ్లమూరు : మినుము, పెసర పంటలలో ఆశించిన పొగాకు లద్దె పురుగు పట్ల రైతులు అప్రమత్తంగా ఉండాలని మండల వ్యవసాయ అధికారి మహమ్మద్ ఫరూక్ అన్నారు. మండలంలోని పులిపాడు, రెడ్డి నగర్ గ్రామాలలో వేసిన పంటలను బుధవారం ఆయన రైతులతో పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ఎప్పటికప్పుడు పప్పు ధాన్యాల సాగులో కలుపు మొక్కలు ఉన్నట్లయితే వాటిని తీసివేయాలన్నారు. పంట వేసిన 30 రోజులలో కలుపు మొక్కలు ఉన్నట్లయితే పంటలు తట్టుకోలేవన్నారు. విత్తనంవిత్తిన నాటిన వెంటనే లేదా రెండు రోజుల లోపు తగిన తేమ చూసుకుని ఎకరానికి ఒక లీటరు పిండి మిథాలిన్(స్టాంపు) 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారి చేయాలి. విత్తనం విత్తిన 15 లేదా 20 రోజులలో గడ్డి జాతి కలుప మొక్కలు మాత్రమే ఉన్నప్పుడు ఎకరాకు 250 మిల్లీ లీటర్ల ఫెనాక్స్ (ప్రాప్ఇడైల్(విష్ సూపర్) లేదా 400 మిల్లీలీటర్ల పిచికారి చేయాలి. గడ్డి జాతి వెడల్పాకు కలుపు మొక్కలు ఉన్నప్పుడు ఫ్యూజిఫ్లెక్స్ 400 మిల్లీమీటర్లు లేదా 800 మిల్లీమీటర్లు షకేత్ వంటి మందులను 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారి చేయాలి. పొగాకు లద్దె పురుగు ఆశించిన పొలాల్లోనే ఆకులు తెల్లగా జల్లెడగా మారుతాయి. నివారణకు 500 మిల్లీలీటర్ల మోనోక్రోటోపాస్ ఒక ఎకరానికి లేదా క్లోరిపైరీ పాస్ 500 మిల్లీమీటర్లు ఎకరాకు చొప్పున పిచికారి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వీఏఏకే క్రాంతిరత్న, బాల వెంకటయ్య, అబ్దుల్ రజాక్, రైతులు పాల్గొన్నారు.

గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలి

విశాలాంధ్ర-ముండ్లమూరు : గర్భిణులు పౌష్టిగా ఆహారం తీసుకోవడం వలన తల్లి బిడ్డకు ఎటువంటి ఆరోగ్య సమస్యలు తలెత్తకుండా ఉంటాయని వైద్యాధికారి బి.మధు శంకర్ అన్నారు. మారెళ్ళ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో గల పోలవరం గ్రామంలో బుధవారం 104 వాహనం ద్వారా గర్భిణీలకు వైద్య పరీక్షలు నిర్వహించారు. గర్భిణీలు బలమైన ఆహారం తీసుకున్నట్ల యితే తల్లి బిడ్డ క్షేమంగా ఉంటారన్నారు. ఆరోగ్య సిబ్బంది గర్భిణీలపై ప్రత్యేకత దృష్టి సారించి క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు నిర్వహించాలని సూచించారు. 104 వాహనం ద్వారా అందుతున్న సేవలను జిల్లా డిప్యూటీ డిఎంహెచ్వో మాధవి లత, జిల్లా న్యూక్లియర్ మెడికల్ అధికారిని డాక్టర్ శ్రీవాణిలు శిబిరాన్ని పరిశీలించారు. అందుతున్న వైద్య సేవలు గురించి అడిగి తెలుసు కున్నారు. ఈ కార్యక్రమంలో హెచ్ వి కె అంజమ్మ, హెల్త్ అసిస్టెంట్ ఎస్ కే యం యం సుభాని, సిహెచ్ఓ శరణ్య, ఏఎన్ఎం సుమతి, డీఈవో వెంకటప్రసాద్ పాల్గొన్నారు.

కారంచేడు మృత వీరులకు ఘన నివాళులు

విశాలాంధ్ర-దర్శి : రాష్ట్ర దళిత సేన దర్శి నియోజకవర్గ అధ్యక్షులు రాచపూడి మోషే అధ్యక్షతన స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో గల అంబేద్కర్ విగ్రహం వద్ద ప్రజా సంఘాల ఆధ్వర్యంలో కారం చేడు మృతవీరులకు ఘన నివాళులు అర్పించడం జరిగింది. ఈ సందర్భంగా నవ్యాంధ్ర మాదిగ చర్మకారులు డప్పు కళాకారుల పోరాట సమితి రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షులు కవలకుంట్ల గోవింద ప్రసాద్ మాదిగ. రాష్ట్ర దళిత సేన దర్శి నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి గర్నెపూడి ప్రేమ్ కుమార్‌లు మాట్లాడుతూ గత 39 సంవత్సరాలు క్రితం జరిగిన కారంచేడు ధమనకాండ నేటికీ మానని నెత్తుటి గాయంగానే ఉందని అన్నారు. ఆనాడు జరిగిన ఘోరమైన అహంకారిత దాడిలో అమరులైన దళిత వీరులు ఆలీ సమ్మ. దుడ్డు మోషే. దుడ్డు రమేష్. తేళ్ల యెహోషువ. తేళ్ల మోషే. తేళ్ల ముత్తయ్య. దుడ్డు అబ్రహాం నేలపై నెత్తురాలకి నెత్తుటికి విత్తులై నేలకొరిగిన రోజన్నారు. దళితుల నెత్తుటి అంకురార్పణకు నడిచిన ఈ దారుణ మారణ కాండకు 35 ఏళ్ల అన్నారు. అగ్రకుల దుహకారుల ఉన్మాదుల దాడిలో అమరులైన కారంచేడు మృతవీరులకు సామాజిక ఉద్యమ జోహార్లు తెలియజేస్తున్నామన్నారు. రాష్ట్రంలో మరొకసారి దళితులపై దాడులు జరగకుండా పటిష్టంగా అట్రాసిటీ కేసును అమలుపరచాలని. ఎస్టీలకు రావాల్సిన రాయితీలు సక్రమంగా వచ్చే లాగున చర్యలు తీసుకోవాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయ కులు గంధం ఇర్మియ, దళిత నాయకులు, పలు ప్రజా సంఘాల కార్యకర్తలు పాల్గొన్నారు.

వాహనదారులు హెల్మెట్ ధరించాలి

విశాలాంధ్ర-పర్చూరు: ద్విచక్ర వాహనదారులు ప్రమాదాల నుండి రక్షణకు శిరస్త్రాణం ధరించాలని బాపట్ల సహాయ మెటారు వాహన తనిఖీ అదికారి(ఏఎంవీఐ) పి.అంకమ్మరావు తెలిపారు. స్థానిక ఆర్టీసీ ప్రయాణ ప్రాంగణం వద్ద బుధవారం మండల న్యాయ సేవాధికార సంస్థ అధ్వర్యంలో హెల్మెట్ ధరించటంపై అవగాహన కలిగించారు. ఆయన మాట్లాడుతూ సమాజంలో ప్రతి ఒక్కరు బాధ్యతగా ప్రయాణ సమయంలో హెల్మెట్ ధరించాలని, దానివలన అనుకోకుండ జరిగే రోడ్డు ప్రమాదాల నుండి తప్పించుకొన వచ్చునని తెలిపారు. మనపై ఆధారపడి కుటుంబాలు ఉంటాయని, అవగాహనతో హెల్మెట్‌ను ధరించాలని సూచించారు. ఆటోలలో ఎక్కువ మందితో ప్రయాణం సురక్షితం కాదని, ఆటోవాలాలకు అంకమ్మరావు హితబోధ చేశారు. కార్యక్రమంలో న్యాయవాదులు రావి రమేష్‌బాబు, పూరిమిట్ల జాన్‌బాబు, పోలీసు, కోర్టు సిబ్బంది ఉన్నారు.

రేపు సమాచార హక్కు చట్టంపై అవగాహన సదస్సు

విశాలాంధ్ర-పర్చూరు: రాష్ట్ర, జిల్లా అధికారుల ఆదేశానుసారం 26వ తేది శుక్రవారం ఉదయం 11 గంటలకు స్థానిక ఏఎంసీలోని రైతు సేవా కేంద్రంలో సమాచార హక్కు చట్టంపై అవగాహన సదస్సు జరుగుతుందని సహాయ వ్యవసాయ సంచాలకులు నాగభైరు మోహనరావు బుధవారం ప్రకటనలో తెలిపారు. ఈ సదస్సుకు గ్రామ, మండల స్థాయి అధికారులు, ప్రజా ప్రతినిధులు హాజరుకావాలని ఏడీఏ మోహనరావు కోరారు.

వార్డుల్లో సమస్యలు పరిష్కరిస్తాం :కమిషనర్

విశాలాంధ్ర - అద్దంకి : అద్దంకి పురపాలక సంఘం పరిధిలోని అన్ని వార్డుల్లో నెలకొన్న సమస్యల్ని గుర్తించి వాటిని సత్వరమే పరిష్కరిస్తామని కమిషనర్ ఎం సత్యనారాయణ అన్నారు. బుధవారం పట్టణంలోని 19 వ వార్డు పరిధిలోని పాత దామవారిపాలెం. ముజావారిపాలెం. వీర రాఘవ స్వామిమాన్యంకాలనీ ప్రాంతాలను స్థానికలతో కలిసి పరిశీలించారు. వార్డు కౌన్సిలర్ ఏజెండ్ల నాగరాజు స్థానిక నాయకులు సమస్యలను కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు. మురుగు నీరు పారుదల .వీధి దీపాలు .మంచినీటి సరఫరా వంటి అంశాలను వివరించారు.

నేటి యువతకు గుర్రం జాషువా ఆదర్శం

విశాలాంధ్ర - చీరాల : అంటరాని కులంలో పుట్టి తన కవిత్వంతో సామాజిక చైతన్యం కలిగించిన గుర్రం జాషువాను స్మరించుకోవడం నేటి యువతకు ఎంతో అవసరమని జగజ్జీవనరావు చైర్ పరిశోధకులు తేళ్ళ రాంబాబు అన్నారు.కవి కోకిల గుర్రం జాషువ 53వ వర్ధంతి సందర్భంగా విజయనగర్ కాలనీ ఎంపీయూపి స్కూలు ఆవరణంలో డాక్టర్ బాబూ జగజ్జీవనరావు చైర్ పరిశోధకులు తేళ్ళ రాంబాబు ఆధ్వర్యంలో స్కూలు ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు విద్యార్థులతో కలసి గుర్రం జాషువ చిత్రపటానికి పూలతో ఘన నివాళులు అర్పించారు.ఈ కార్యక్రమంలో తేళ్ళ. రాంబాబు మాట్లాడుతూ గుర్రం జాషువా వంటి మహోన్నతమైన వ్యక్తిని స్మరించుకోవడం సమాజానికి, బావితరాల విద్యార్థులకు ఎంతో అవసరమని అన్నారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అమరావతికి నిధులు కేటాయించడం హర్షణీయం

నల్లూరిపాలెం చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు వీరవల్లి శివరామకృష్ణ

విశాలాంధ్ర - రేపల్లె : కూటమి ప్రభుత్వం రాష్ట్రాన్ని అభివృద్ధి వైపు పరుగులు పెట్టిస్తుందని నల్లూరిపాలెం చారిటబుల్ ట్రస్టు వ్యవస్థాపకులు టీడీపీ నాయకుడు వీరవల్లి శివరామకృష్ణ అన్నారు. రాజధాని అమరావతి అభివృద్ధికి రూ.15 వేల కోట్లు ప్రత్యేక సాయం, అవసరాన్ని బట్టి భవిష్యత్తులో అమరావతికి మరిన్ని అదనపు నిధులు కేటాయింపు పట్ల శివరామకృష్ణ హర్షం వ్యక్తం చేశారు. రేపల్లెలో తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వ ఐదు సంవత్సరాల పాలనలో అభి వృద్ధిలో వెనకడుగులో ఉన్న ఏపీని మరింత అభివృద్ధి చేసేందుకు ఐదు సంవత్సరాలలో పూర్తి స్థాయిలో సహకరిస్తామని చెప్పడం హర్షించదగ్గ విషయం అన్నారు. నవ్యాంధ్ర రాజధాని అమరావతి పునర్నిర్మాణం, పోలవరం ప్రాజెక్టు నిర్మాణం, రాష్ట్రానికి పరిశ్రమలు ఏర్పాటుకు నిధులు కేటాయిస్తున్నట్లు ప్రకటించరన్నారు. ఏపీ విభజన చట్టానికి అనుగుణంగా పోలవరం సత్వర నిర్మాణా నికి సంపూర్ణ సాయం, పోలవరానికి కావాల్సిన నిధులు కేటాయింపు కేంద్ర ప్రభుత్వం ప్రక టించిందన్నారు. రాష్ట్ర విభజన చట్టం ప్రకారం పారిశ్రామికా భి వృద్ధికి ప్రత్యేక సహకారం విశాఖ-చెన్నై పారిశ్రామిక కారిడార్ లోని నోడ్‌లకు, హైదరాబాద్-బెంగళూరు పారిశ్రామిక కారిడార్ అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయించటం గొప్ప విషయం అన్నారు. కొప్పర్తి, ఓర్వకల్లు పారిశ్రామిక కేంద్రాలకు నీళ్లు, విద్యుత్, రోడ్లు, హైవేల అభి వృద్ధికి నిధులు విశాఖ-చెన్నై కారిడార్‌లో కొప్పర్తికి, హైదరాబాద్-బెంగళూరు కారిడార్‌లో ఓర్వకల్లుకు నిధులు, ఏపీలోని వెనుకబడిన ప్రాంతాలకు ప్రత్యేక ప్యాకేజీ రాయలసీమ, ప్రకాశం, ఉత్తరాంధ్ర జిల్లాలకు ప్రత్యేక ప్యాకేజీ కింద నిధులు,ఏపీ విభజన చట్టంలో పేర్కొన్న మేరకు వెనుకబడిన ప్రాంతాలకు నిధులు కేంద్ర ప్రభుత్వం ప్రకటించిందన్నారు. సీఎంచంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో రాష్ట్రం అభి వృద్ధి పథంలో దూసుకుపోతుందన్నారు. ఎన్డీఏ ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపారు.

ప్రజలకు అందుబాటులోకి అపరకర్మల రాణి సత్రం

విశాలాంధ్ర - రేపల్లె : రాచూరు జమీందారు ఆధ్వర్యంలో రేపల్లె మున్సిపాలిటీ నిర్వహిస్తున్న రేపల్లె - పెనుమూడి రహదారి మార్గంలో ఇటీవల నూతనంగా సుమారు రూ.3.75 లక్షలతో ఆధునిక వసతులతో నిర్మించిన ఆపారకర్మల రాణి సత్రం భవనం రేపల్లె పట్టణ పరిసర ప్రాంతలలోని అన్ని వర్గాల ప్రజలకు అందుబాటులోకి రావడం పట్ల ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. కొన్ని సంవత్సరాలుగా అద్దె ఇళ్లల్లో ఉంటున్న కుటుంబాల వారు వారికి సంబంధించిన కుటుంబ పెద్దలు చనిపోయినప్పుడు అపరకర్మకాండలు చేసుకొను టకు సరైన వసతులతో కూడిన భవనాలు లేక, పట్టణ పరిసర ప్రాంత ప్రజలు ఎంతో ఇబ్బంది పడుతున్నారు.పట్టణంలో రాణి సత్రం గతంలో పాత బిల్డింగ్‌లో ఉన్నప్పుడు అపరకర్మ కాండలు నిర్వహించుకుని దశ దిన కర్మలు పూర్తయ్య వరకు ఆ సత్రంలోనే ఉండేవారు. నాలుగు సంవత్సరాల క్రితం పాడుబడిపోయిన రాణి సత్రాన్ని మున్సిపాలిటీ తొలగించి దాని స్థానంలో ఇటీవల కొత్త భవనాన్ని మున్సిపల్ అధికారులు వైసీపీ ప్రభుత్వంలో రాజ్యసభ సభ్యుడు మోపిదేవి రమణారావు నిధులు సమకూర్చి పట్టణ ప్రజల సమస్యలను పరిష్కరించే దశలో ఈ భవనాన్ని నిర్మించారు .దీంతో రాణి సత్రం ఆపార కర్మకాండల భవనంగా నామకరణం చేసి ఇటీవల రాజ్యసభ సభ్యులు మోపిదేవి వెంకట రమణారావు, బుడా చైర్మన్ దేవినేని మల్లికార్జున రావు, మున్సిపల్ చైర్మన్ కట్ట మంగ, వైస్ చైర్మన్లు ప్రశాంత్ కుమార్, విశ్వనాథ్ గుప్తా, ఇతర ప్రజాప్రతినిధులు, పలు వైసీపీ నాయకులు, ఎన్నికల కోడ్ వచ్చేలోపు ఈ భవనాన్ని ప్రారంభించి ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా చర్యలు చేపట్టడం పట్ల ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తూ ,అద్దె ఇళ్లల్లో ఉండి ఇబ్బందులు పడేవారు పడకుండా ఉండే విధంగా ఈ సత్రం అన్ని సౌకర్యాలతో ఉపయోగంలోకి రావడం పట్ల పట్టణ ప్రజలు ముఖ్యంగా అద్దె ఇళ్లల్లో ఉండే వారు హర్షం వ్యక్తం చేస్తూ ఉన్నారు ప్రత్యేకంగా చిన్న చిన్న ఫంక్షన్లు, సభలో, సమావేశాలు, నిర్వహించుకునేందుకు వీలుగా గ్రౌండ్ ఫ్లోర్ నిర్మించారు .అదేవిధంగా పై అంతస్తులు ఆరు షాపులను గదులుగా నిర్మించి ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా రాణి సత్రాన్ని తీర్చిదిద్దారు.

గత పాలనలో హింసకు గురైన ప్రజల పరిస్థితి...?

సోమేశ్వరరావు

విశాలాంధ్ర - రేపల్లె : గత వైసీపీ పాలనలో హింసకు గురైన ప్రజలు, నాయకుల సంగతి ఏమిటనీ రేపల్లె నియోజకవర్గం టీడీపీ నాయకుడు కామరాజు గడ్డ సోమేశ్వరరావు ప్రశ్నించారు.ఈ సందర్భంగా ఆయన బుధవారం మీడియా సమావేశంలో మాట్లాడుతూ పోలీస్ వ్యవస్థనే పావుగా వాడుకుని ఇపుడు దురుసుగా ప్రవర్తించటాన్ని తప్పు పట్టారు. మీ పాలనలో 2020లో తాడేపల్లి పోలీస్ స్టేషన్ కేంద్రంగా పోలీసులు చేత కేస్ నెంబర్ 941/2020 ఒక తప్పుడు కేసులో అక్రమంగా అరెస్టు చేయించి 41ఏ నోటీసులు ఇవ్వకుండా రెండు రోజులు పాటు నిర్బంధించిన సీఐ ఎం. సుబ్రహ్మణ్యం,ఎస్సై ఏ. శ్రీనివాసరావు, వాళ్ల కానిస్టేబుల్స్ ఒక వైఎస్సార్సీపి ఎమ్మెల్యే ప్రమేయంతో జరిగితే దానిమీద సంబంధిత ఎస్పీ, డీజీపీలకు ఫిర్యాదులు చేసిన పట్టించుకోలేదన్నారు. అదేవిధంగా మంగళగిరి నియోజకవర్గ అప్పటి ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి జరిగిన హత్యాయత్నం గురించి వివరించిన ఎటువంటి యాక్షన్ తీసుకోకపోవటం అనేది చాలా స్పష్టంగా దీని వెనక పూర్తిగా వైఎస్సార్సీపీ హస్తం ఉందని తెలుస్తుందన్నారు. పోలీసులు నాడు కొట్టిన దెబ్బలకు ఆ ఇద్దరి వ్యక్తులలో ఒక వ్యక్తి ఆ బాధలు తట్టుకోలేక గుండెపోటుతో చనిపోగా, ఇంకో వ్యక్తి పోరాటం చేస్తూనే ఉన్నాడన్నారు. చనిపోయిన వ్యక్తి ప్రాణాలు తీసుకువస్తారా అని ప్రశ్నించారు. అసెంబ్లీ గేటు బయట మధుసూదన్ రావు అనే ఒక పోలీస్ అధికారికి వార్నింగ్ ఇవ్వటాన్ని తప్పుపట్టారు. వ్యవస్థల్ని నాశనం చేసి మీరు పుట్టించిన హింసకాండ సామాన్య ప్రజలతో పాటుగా సీఎం నారా చంద్రబాబునాయుడు వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు అదేవిధంగా పార్టీలో వివిధ క్యాడర్ వాళ్లని సామాన్య ప్రజలని సైతం పోలీ సులను ఉపయోగించుకుని హింసించిన ఘటనలు ప్రజలు మర్చిపోలేదన్నారు. ప్రశ్నించే వాళ్లపై తప్పు డు కేసులు పెట్టి కొట్టించి హింసించావు ప్రజా స్వామ్యం అంటే అప్పుడు గుర్తుకు రాలేదా అన్నారు. ఎన్టీ రామారావు అన్నట్లు ప్రజలే దేవుళ్ళని పాల కులు సేవకులుగా ఉండాలని ఆయన మరోసారి గుర్తు చేశారు.

ప్రయాణికులను మోసం చేస్తున్న రేపల్లె ఆర్టీసీ డిపో

పట్టణ అభివృద్ధి సంఘు కార్యదర్శి మోహన్ రావు

విశాలాంధ్ర - రేపల్లె : ప్రయాణికులను రేపల్లె ఆర్టీసీ డిపో నిలువున దోపిది చే స్తోందని పట్టణ అభి వృద్ధి సంఘు కార్యదర్శి సివి మోహన్‌రావు ఆరోపించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రేపల్లె - గుంటూరు ఎక్స్‌ప్రెస్ బస్ సర్వీస్‌లు, రేపల్లె-పేటేరు-పల్లికోన-వేమవరం-భట్టిప్రోలు-చందోలు-పొన్నూరు, మీదుగా గుంటూరుకు, అదే రూట్‌లో రేపల్లెకు వచ్చేవి ప్రయాణ దూరం సుమారుగా 78 కిలోమీటర్లు ఉంటుందని ఛార్జి రూ.105లు. వసూలు వసూలు చేస్తున్నారన్నారు. ప్రస్తుతం రేపల్లె గుంటూరు ఎక్స్‌ప్రెస్ బస్సులు రేపల్లె-పేటేరు-ఓలేరు రోడ్డు-నేషనల్ హైవే మీదుగా వేమవరం తరువాత ,ఆర్ అండ్ బి రోడ్డు మీదుగా భట్టిప్రోలు పాత మార్గంలో నడుస్తున్నవన్నారు. దీంతో ప్రయాణ దూరం రేపల్లె- గుంటూరుకి సుమారుగా 68 కిలోమీటర్లు మాత్రమే అన్నారు. ప్రయాణ చార్జి రూ.105 వసూళ్లు చేస్తున్నారన్నారు. రేపల్లెకు ప్రయాణ దూరం 10 కిలోమీటర్లు తగ్గినందున, ప్రతి ఎక్స్ ప్రెస్ బస్సుకు సుమారు రెండు లీటర్ల డీజిల్ ఆదా అవుతుందన్నారు. ఈ విధంగా 18 ట్రిప్పులు రేపల్లె- గుంటూరుకు, 18 ట్రిప్పులు గుంటూరు- తిరుగుచున్నందున 72 లీటర్ల డీజిల్ ప్రతిరోజు ఆదా అవుతున్నప్పటికీ, ఇప్పుడు కూడా 68 కిలో మీటర్ల దూరమునకు రూ.105లు వసూలు చేస్తున్నారన్నారు. ఆర్టీసీ డిపో ప్రయాణికులను నిలువుదోపిడి చేయుచున్నారని బస్‌ఛార్జి రూ.90 కంటే మించదన్నారు. అన్యాయంగా, అధికంగా రూ.15, కేవలం రేపల్లె- భట్టిప్రోలు వరకు, రేపల్లె-భట్టిప్రోలు మీదుగా ప్రయాణించే ప్రయాణికుల నుండి వసూలు చేస్తున్నారని ఆయన ఆరోపించారు. రేపల్లె డిపో మేనేజర్ బాపట్ల రీజనల్ మేనేజర్ ఉన్నతాధికారులు పరిశీలించి, అన్యాయంగా, అదనముగా వసూలు చేస్తున్న రూ.15 ప్రతి తగ్గించాలని కోరారు.

రథ నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తి చేయాలి

మాజీ ఎమ్మెల్సీ అన్నం సతీష్ ప్రభాకర్

విశాలాంధ్ర - బాపట్ల టౌన్ : భావ దేవుని రథం పనులను త్వరితగతిన పూర్తి చేసి స్వామి వారి దేవస్థానం వద్ద అందుబాటులో ఉంచాలని రథం పనుల నిర్మాణ కాంట్రాక్టర్‌ను మాజీ ఎమ్మెల్సీ అన్నం సతీష్ ప్రభాకర్ కోరారు.పట్టణంలోని తూర్పు సత్రంలో స్థలం లో నిర్మాణం జరుగుతున్న శ్రీ రాజ్యలక్ష్మి సమేత క్షీర భావనారాయణ స్వామి వారి రథం పనులను బుధవారం ఆయన బిజెపి నాయకులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా అన్నం సతీష్ ప్రభాకర్ మాట్లాడుతూ కోటి రూపాయల వ్యయం తో భావ దేవుని రథం నిర్మించాలని ప్రతిపాదనలు చేయగా రూ. 85 లక్షలు రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిందని,మరో రూ.15 లక్షల తాను స్వామి వారి రథం నిర్మాణం కు విరాళంగా అందజేసినట్లు పేర్కొన్నారు.ఇప్పటికే చాలా వరకు పనులు అయ్యాయని,త్వరలోనే పనులు పూర్తి చేసుకొని వేదమంత్రాలతో అర్చకుల ద్వారా ప్రత్యేక పూజలు రథం పూజలు అందుకుంటుందని తెలిపారు. వచ్చే భావనారాయణ స్వామి రథోత్సవానికి స్వామి వారు నూతన రథంపై భక్తులకు దర్శనమిస్తారని తెలిపారు.ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా పార్టీ అధ్యక్షుడు లక్ష్మీనారాయణ,బాబు నాగేంద్ర, కోట్ర రామకృష్ణ, మోహన్ గౌడ్,బొడ్డు కృష్ణ చైతన్య, నాసిన మణి కుమార్,కొక్కిలిగడ్డ శ్రీనివాసరాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రతిభ విద్యార్థికి ఆర్థిక సాయం

విశాలాంధ్ర - చీరాల : ప్రతిభ కలిగిన విద్యార్థులకు ఆర్థికలేమి అడ్డంకి కాకూడదని బందారుపల్లి హేమంత్ కుమార్ అన్నారు.బుధవారం చీరాల రోటరీ కమ్యూనిటీహాలులో చీరాల రోటరీ క్లబ్ ఆర్థిక సహకారంతో విజయవాడ శ్రీచైతన్య కాలేజీలో ఐఐటి కోచింగ్ తీసుకొని,ఇంటర్ లో 980 మార్కులు సాధించి,బీహార్ ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ,పాట్నాలో సీటు సంపాదించిన బోగిరెడ్డి సంయుక్త అనే పేద విద్యార్థిని కి చదువు నిమిత్తం రొటేరియన్, బందారుపల్లి హేమంత్ కుమార్ రూ.20,000 వేలు ఆర్థిక సాయం అందచేశారు. ఈ కార్యక్రమంలో చీరాల కృష్ణమూర్తి,నక్కల సురేష్ బాబు,పోలుదాసు రామకృష్ణ, దోగుపర్తి వెంకట సురేష్,డాక్టర్ బాబూ రావు,మామిడాల శ్రీనివాసరావు,హరి నారాయణ,రోటరీ సభ్యులు పాల్గొన్నారు.

సి.ఆర్.మోహన్ చిరస్మరణీయులు

విశాలాంధ్ర, తెనాలి : కళ కళ కోసం కాదు ప్రజ కోసం అనే నినాదంతో జీవితాంతం ప్రజానాట్య మండలి అభ్యున్నతి కోసం నాటిక, నాటక, వివిధ కళారూపాలు ప్రదర్శించి ప్రజా చైతన్యం కోసం కృషి చేసిన మహోన్నతుడు సి.ఆర్. మోహన్ అని ఆంధ్రప్రదేశ్ ప్రజా నాట్యమండలి, గుంటూరు జిల్లా అధ్యక్షులు బొల్లిముంత కృష్ణ నివాళులర్పించారు. తెనాలి గాంధీనగర్ ఇస్యూఫ్ సమావేశ హాలులో బుధవారం జరిగిన సి.ఆర్.మోహన్ సంస్మరణ కార్యక్రమంలో ఆయన అధ్యక్షత వహించి మాట్లాడారు. కళాకారునిగా నటుడు, దర్శకుడు, వివిధ కళాసంస్థల నిర్వాహకునిగా రాష్ట్ర రాష్ట్రేతరంగా పేరుపొందారని చెప్పారు. రక్తకన్నీరు, బికారి రాముడు, అందరూ బ్రతకాలి తదితర నాటకాలను సినీనటుడు రక్తకన్నీరు నాగభూషణంతో కలిసి వందలాది ప్రదర్శనలిచ్చారన్నారు. తెనాలి నాటక రంగంతో ఎక్కువ పరిచయం ఉన్న వ్యక్తి తెనాలిలో పలు కార్యక్రమాలలో విస్తృతంగా పాల్గొన్నారని చెప్పారు. ప్రముఖ అభ్యుదయ సినీ రచయిత బొల్లి ముంత శివరామకృష్ణతో ఎక్కువ సంబంధ బాంధవ్యాలున్నాయని ఇరువురు కలిసి సాంస్కృతిక రంగ బలోపేతానికి కృషి చేశారని చెప్పారు. ఎఐటీయూసీ జిల్లా నాయకులు గురుబ్రహ్మం మాట్లాడుతూ కార్మికరంగ సమస్యలపై ఉద్యమాలు పోరాటాలు నిర్వహించారని ఆయనకు జోహార్లర్పించారు. సీపీఐ కొల్లిపర నియోజకవర్గ కార్యదర్శి బాలస్వామి మాట్లాడుతూ కృష్ణ గారితో కలిసి చిలకలూరిపేటలో జరిగిన వివిధ కార్యక్రమాల్లో పాల్గొన్నారని ఆయన కార్మికుల, కర్షకులకు అండగా నిలిచి వారి సమస్యల పరిష్కారంలో ప్రథమ పాత్ర వహించేవారని చెప్పారు. సభా ప్రారంభంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి జోహార్లర్పించారు. కార్యక్రమంలో వెంకటేశ్వరరావు, నాగేశ్వరరావు, కోటేశ్వరరావు, వీణ, విజయలక్ష్మి, విజయదుర్గ తదితరులు పాల్గొన్నారు.

చేనేత రంగానికి నిధులు పెంచండి

శీలం వేంకటేశ్వర్లు

విశాలాంధ్ర - చీరాల : దేశంలో వ్యవసాయ రంగం తర్వాత అతిపెద్ద పారిశ్రామిక రంగం చేనేత రంగమని జాతీయ చేతి వృత్తుల ఐక్య వేదిక పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు శీలం వేంకటేశ్వర్లు అన్నారు.కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన బడ్జెట్ కేటాయింపులలో చేనేత రంగానికి తక్కువ మొత్తంలో కేటాయింపులు చేశారని శీలం వేంకటేశ్వర్లు ప్రకటన విడుదల చేశారు.భారతదేశ స్వతంత్ర పోరాటంలో కీలక ఘట్టం అయిన విదేశీ వస్త్ర బహిష్కరణ ఉద్యమంలో చేనేత రంగం కీలక పాత్ర పోషించిందని జాతీయ చేనేత దినోత్సవాన్ని ప్రధాని ప్రకటించారు కానీ గత పది సంవత్సరాలుగా కేంద్ర వార్షిక బడ్జెట్లో 200 కోట్లకు మించి బడ్జెట్లో పెట్టిన దాఖలాలే లేవని అన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు చేనేత వర్గాలను నిర్లక్ష్యం చేస్తున్నాయని,రాజకీయ రంగంలో కానీ వ్యాపారంగంలో కానీ ఏ ప్రభుత్వాలు చేనేత రంగాన్ని గుర్తించలేదని ఆవేదన వ్యక్తం చేశారు.భారతదేశంలో కోట్లాదిమంది చేనేత రంగంపై ఆధారపడి జీవనం కొనసాగిస్తున్నారని బడ్జెట్ అంచనాలను మార్చి ఈ పార్లమెంట్ సమావేశాలలోని చేనేత రంగానికి ఈ బడ్జెట్లో కనీసం 25 వేల కోట్లు కేటాయింపులు చేసి చేనేత పరిశ్రమను కాపాడాలని అన్నారు.చేనేతల పై జీఎస్టి తక్షణమే రద్దు చేసి బడ్జెట్లో 25 వేల కోట్లు నిధులు కేటాయించాలని, చేనేతకు హక్కుగా ఉన్న 11 రకాల చట్టాలను కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పకడ్బందీగా అమలు చేయాలని అన్నారు. చేనేత రంగానికి మార్కెటింగ్ సదుపాయం కల్పించాలని,చేనేతలు ఎక్కువగా ఉన్న జిల్లాలలో జిల్లాకు ఒక చేనేత బజారు ఏర్పాటు చేసి చేనేతలు తయారు చేసిన బట్టను ప్రభుత్వాలే కొనుగోలు చేయాలని,చేనేతలు వాడే రంగులు రసాయనాలు నూలు జెర్రీ పట్టు రేషన్ మొదలగు వాటినీ సబ్సిడీలపై చేనేతలకు అందించాలని కోరారు. గతంలో ఉన్న రాయితీలు సబ్సిడీలు బున్ కర భీమా పథకాలను పునరుద్ధరించాలని,చేనేతలకు ముద్రలోన్లు ఐదు లక్షల పెంచాలని,ఇల్లు లేని చేనేతలకు ఐదు సెంట్లు స్థలం లో హౌస్ అండ్ వర్క్ షెడ్ ప్రభుత్వమే నిర్మించి ఇవ్వాలని డిమాండ్ చేశారు.కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు వారంలో ఒకరోజు చేనేత వస్త్రాలు ధరించేలా చేనేత వృత్తిని ప్రోత్సహించాలని,ఆత్మహత్యలు చేసుకున్న చేనేత కార్మికులకు 20 లక్షలు ఎక్స్గ్రేషియా ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

రాష్ట్ర పునర్నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం చేయూత హర్షణీయం

విశాలాంధ్ర - వేమూరు : ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయకత్వంలోని రాష్ట్రానికి కేంద్ర బడ్జెట్లో 15 వేల కోట్లు నిధులు కేటాయించటం హర్షణీయమని టిడిపి నేత మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ జొన్నలగడ్డ విజయబాబు పేర్కొన్నారు.బుధవారం టిడిపి కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ గత ఐదేళ్ల వైసిపి పాలనలో అభివృద్ధి పదంగా పూర్తిగా వెనుకబడినటువంటి, రాజధాని లేని ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి కేంద్ర ప్రభుత్వం అమరావతి రాజధాని నిర్మాణం కోసం నిధులు సమకూర్చటం అభినందనీయమన్నారు. ఎన్డీఏ కూటమి ప్రభుత్వంలో రాష్ట్రం అన్ని రంగాల్లో ముందుకు పోతుందనే దానికి నిధులు కేటాయింపు నిదర్శనం అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలో ఆంధ్రప్రదేశ్ పునర్నిర్మాణంతో పాటు రాజధాని అమరావతి పోలవరం ప్రాజెక్టులు వేగంగా నిర్మాణం జరుగుతాయని ఆయన పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం బడ్జెట్లో నిధులు కేటాయింపుకు కృతజ్ఞతలు తెలియజేశారు. సమావేశంలో షేక్ హనీఫ్, అమ్మిశెట్టి కిషోర్, కొగంటి శ్రీను బాబు,ప్రోలు ప్రసాద్, గంటా శ్రీనివాసరావు, పిల్లి ఫణీంద్ర, రాజేష్ తదితరులు ఉన్నారు.

రాష్ట్ర అభివృద్ధి ఎన్డీఏ కూటమితోనే సాధ్యం

ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ

విశాలాంధ్ర - బాపట్ల టౌన్ : ఆంధ్ర రాష్ట్రానికి కేంద్ర బడ్జెట్లో నిధులు కేటాయించడం కూటమి విజయమని ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మ పేర్కొన్నారు. పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలలో రాష్ట్ర అభివృద్ధి కొరకు కేటాయించిన నిధులపై హర్షం వ్యక్తం చేశారు. ప్రధాని మోదీ, ఆర్థిక మంత్రి నిర్మల సీతారామన్‌కి రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ఏర్పడిన తర్వాత తొలి బడ్జెట్ సమావేశాలలో అమరావతి అభివృద్ధికి రూ.15 వేల కోట్ల ఆర్థిక సహాయం ప్రకటించడం హర్షించదగ్గ విషయం అన్నారు. 4.1 కోట్ల మంది యువతకు ఉపాధి, నైపుణ్యం ఉద్యోగ అవకాశాలు కల్పించడం ఆక్వాకల్చర్ ఉత్పాదకతను ఎగుమతులను పెంపొందించడం అభినందనీయమన్నారు వ్యవసాయ ఆధారిత రంగానికి రూ.1.27 లక్షల కోట్లు కేటాయించారన్నారు. అదే విధంగా రాయలసీమ ప్రకాశం ఉత్తరాంధ్రలో వెనుక బడిన జిల్లాలకు ప్రత్యేక ప్యాకేజీ ప్రకటించి హైద రాబాద్ బెంగుళూరు పారిశ్రామిక కారిడార్ అభివృద్ధికి హామీ ఇచ్చారన్నారు. పూర్వోదయ పథకం ద్వారా ఏపీకి ప్రత్యేక ప్రాజెక్టులు రాజధాని అమరావతి అభివృద్ధికి, పోలవరం నిర్మాణానికి పూర్తి హామీ ఇచ్చారని విశాఖ - చెన్నై పారిశ్రామిక కారిడార్ కి రోడ్లకు ప్రత్యేక సాయం అందిస్తున్నారని పేర్కొన్నారు. నీరు, విద్యుత్, రైల్వే, రోడ్లు ప్రాజెక్టులకు దశలవారీగా నిధులు కేటాయించడం ఎన్డీఏ హయాంలో లోనే సాధ్యం అవుతుందన్నారు. గత ప్రభుత్వ నిరంకుశ పాలన వలన రాష్ట్రం 20 సంవత్సరాలు వెనుకి వెళ్ళిందన్నారు. రానున్న 5 సంవత్సరాలు లో రాష్ట్ర అభివృద్ధికి పథంలో నడిపేందుకు ముఖ్య మంత్రి చంద్రబాబునాయుడు అన్ని విధాలుగా ప్రణాళికలు రూపొందిస్తున్నారన్నారు.

ముమ్మరంగా వ్యవసాయ పనులు

విశాలాంధ్ర - కర్లపాలెం : గత కొన్ని రోజులుగా కురిసిన వర్షాల దాటికి మండలంలో వ్యవసాయ పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. రైతులు పొలాలను చదును చేసి అదునులోకి తెచ్చుకుని వరి విత్తనాలు పోసే కార్యక్రమం చేపడుతున్నారు. కర్లపాలెం మండలం నర్రావారిపాలెం గ్రామంలో రైతులు బుధవారం ఒక్కరోజే భారీగా విత్తనాలు పోయటంతో పాటు వెద పద్ధతిలో వరి విత్తనాలు పోశారు. విత్తనాలు పోయడానికి వాతావరణం అనుకూలంగా ఉండటంతో రైతులు వ్యవసాయ పనులకు ఆసక్తి చూపుతున్నారు అంతేకాకుండా వాతావరణం కూడా అనుకూలంగా ఉండటంతో వ్యవసాయ పనులు ముమ్మరంగా సాగుతున్నాయి.

27న మండల ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశం

విశాలాంధ్ర-మర్రిపూడి : స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఈ నెల 27 తేదీన శనివారం ఉదయం 11 గంటలకు మండల ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశం ఎంపీపీ వాకా వెంకటరెడ్డి అధ్య క్షతన నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో ఎన్ సుదీప బుధవారం తెలి పారు. వివిధ శాఖల అధికారులు తగిన సమాచారంతో సమావేశానికి హాజరుకావాలని సూచించారు. అదేవిధంగా ప్రజాప్రతి నిధులు ఎంపీటీసీలు, సర్పంచ్‌లు హాజరు కావాలని కోరారు.

టీడీపీ కార్యాలయంలో గుర్రం జాషువా వర్ధంతి

విశాలాంధ్ర - బాపట్ల టౌన్ : విశ్వ నరుదు మహా కవి గుర్రం జాషువా వర్ధంతి సందర్భంగా ఎంపీ తెన్నేటి కృష్ణ ప్రసాద్ పార్టీ కార్యాలయంలో టీడీపీ మైనారిటీ నాయకులు పఠాన్ రాజేష్ జాషువా చిత్ర పటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాట్లా డుతూ సమాజంలో అసమానతలను తన కలంతో ప్రశ్నించి,ఒక దళిత యువ కుడ్ని కదా నాయకుడిగా మలిచి అయన రచించిన గబ్బీలం ఆనాటి సమా జంలో చైతన్యానికి నాంది పలికిందన్నారు.ఈ కార్యక్రమంలో సిరాజుద్దీన్, రామారావు, ప్రదీప్, కొండలు, జీ ప్రసాద్, మున్నా, వలిలు పాల్గొన్నారు.

శిక్ష సప్తాహ్‌పై విద్యార్థులకు అవగాహన

విశాలాంధ్ర-కొనకనమిట్ల : మండలంలోని వద్దిమడుగు ప్రాథమికోన్నత పాఠశాలలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రారంభించిన శిక్ష సప్తాహ్‌పై పాఠశాల ప్రధానోపాధ్యాయుడు టి నరసింహారావు ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు విద్యార్థులకు మొదటిరోజు టీఎల్ఎం బోధన సామాగ్రి అయిన బోధన ఉపకరణాల ద్వారా, విద్యార్థులకు అవగాహన కల్పించారు. రెండవ రోజు సంఖ్య శాస్త్రం పై విద్యార్థులచే వివిధ రకాల గణిత చార్టులను ప్రదర్శన చేయించారు. మూడవరోజు క్రీడలపై అవగాహన కల్పించి, ఆటల ద్వారా విద్యార్థులకు మానసిక ఉల్లాసం తో పాటు ఆరోగ్యంగా ఉంటారని వివరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు జి ఏడుకొండలు, ఎస్ ప్రసాద్‌రావు, జి రాంబాబు, సుచరిత ,పి నందిని, కే భార్గవి. విద్యార్థులు పాల్గొన్నారు. విద్యార్థులు ప్రదర్శించిన చార్టులను ఆటలు పోటీలను వారి విద్యార్థులు తల్లిదండ్రులు తిలకించారు.

కోడవగంటి బాబుకు ఆర్థిక చేయూత

విశాలాంధ్ర-వెలిగండ్ల : మోటార్ సైకిల్ ప్రమాదానికి గురై మంచానికి పరిమితమైన కోడవ కంటి బాబుకి వెలిగండ్ల ఉపాధ్యా యులు గొరిగే లక్ష్మీనారాయణ ఐదువేల రూపాయలు బుధవారం వారి ఇంటికి వెళ్లి ఆర్థిక సహా యాన్ని అందజేశారు ఈ సంద ర్భంగా సర్పంచ్ తాతపూడి సురేష్ బాబు మాట్లాడుతూ ప్రమాదం జరిగిందని తెలిసిన వెంటనే ఉపాధ్యాయుడు లక్ష్మీనారాయణ వారి కుటుంబానికి చేదోడుగా నిలిచేందుకు తన వంతుగా ఆర్థిక సహాయాన్ని అందజేశారని వారికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేసినట్లు ఆయన తెలిపారు. సింగిల్ విండో మాజీ డైరెక్టర్ తాతపూడి నాని పెద్ద సురేష్ తదితరులు పాల్గొన్నారు.

కోడి పందేల శిబిరంపై పోలీసులు దాడులు

విశాలాంధ్ర-మద్దిపూడి : మద్దిపూడి మండలంలోని జగుంట గ్రామంలో కోడిపందాలు నిర్వహిస్తున్న శిబిరం మీద పోలీసులు బుధవారం దాడులు నిర్వహించారు. కోడిపందాలు నిర్వహిస్తున్న 11 మందితో పాటు పోలీసులు రెండు కోళ్లు, 14725 రూపాయల నగదును స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు జోడర్ల మీద కేసు నమోదు చేసి కోర్టుకు హాజరు పరచనున్నట్లు స్టేషన్ ఎస్ఐ శివ బసవరాజు తెలిపారు. అదేవిధంగా గత కొంతకాలంగా మద్దిపూడి మండలంలోని వివిధ గ్రామాల శివారులలో కోడిపందాలు , పేకాట శిబిరాలను నిర్వహించటంపై పోలీసులు నిఘా పెట్టారు. మండలంలో ఎక్కడైనా ఎవరైనా అవాంఛనీయ సంఘటనలకు జూదాలకు పాల్పడినట్లయితే తగిన చర్యలు తీసుకుంటామని కేసులు నమోదు చేస్తామని ఎస్సై తెలిపారు.

మాజీ సైనికుల సమస్యలకు త్వరలో పరిష్కారం

ఆర్డీవో జీవీ సుబ్బారెడ్డి

విశాలాంధ్ర-ముండ్లమూరు : మండలంలోని పసుపుగల్లు గ్రామం లో మాజీ సైనికుల భూ సమస్యలు దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్నా యని వాటికి త్వరలోనే పరిష్కారం జరుగుతుందని ఒంగోలు ఆర్డీవో జీవి సుబ్బారెడ్డి సూచించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయాన్ని బుధవా రం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పసుపుగల్లు గ్రామ పరిధిలో నలుగు రు మాజీ సైనికులకు ప్రభుత్వం ప్రభుత్వ భూమిని కేటాయించిందని అన్నారు. అయితే ఆ గ్రామానికి చెందిన కొందరు మా భూమి అని మాజీ సైనికులకు అభ్యంతరం తెలిపారు. అయితే మాజీ సైనికులు గతంలో కలెక్టర్ కార్యాలయంలో స్పందన కార్యక్రమంలో అర్జీ అందజే శారు. కలెక్టర్ కార్యాలయం వారు ఈ భూమిని పరిష్కరించాలని తహసీ ల్దార్ కార్యాలయానికి నోటీసులు పంపించారు. సంవత్సరాల గడుస్తు న్న భూ సమస్య పరిష్కారం కాకపో వడంతో మరల కలెక్టర్ కార్యాల యంలో అర్జీ అందజేశారు. దీంతో స్పందించిన ఒంగోలు ఆర్డీవో జీవి సు బ్బారెడ్డి తహసీల్దార్ కార్యాలయంలో అధికారులతో సమావేశం నిర్వహించి ఈ భూమిపై అన్ని వివరాలు అడిగి తెలుసుకున్నారు. త్వరలో ఈ భూమి సమస్యను పరిష్కరించాలని అధికారులు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ జే మధుబాబు, ఆర్డిఓ ఆఫీస్ సీనియర్ అసిస్టెంట్ రాము, డిప్యూటీ తహసిల్దార్ జి పుల్లారెడ్డి, ల్యాండ్ సర్వే డిప్యూటీ తహసిల్దార్ ఎ స్రవంతి, ఆర్ఐ కెవి ప్రసాద్, సీనియర్ అసిస్టెంట్ పోగుల శేషగిరిరావు, జూనియర్ అసిస్టెంట్ ప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

పిల్లలకు పౌష్టికాహారం అందించాలి

విశాలాంధ్ర-సీఎస్‌పురం : అంగన్‌వాడీ సెంటర్లలో ప్రతి లబ్ధిదారునికి అందించే పోషకాహారం సక్రమంగా అందేలా కృషి చేయా లని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ దేవ కృపావరం కోరారు. మండల కేంద్రమైన సీఎస్‌పురంలోని వెలిగండ్ల ఐసీడీఎస్ ప్రాజెక్టు సెక్టారు సమావేశం బుధవారం స్థానిక వడ్డెపాలెం అంగన్‌వాడీ పాఠశాలలో జరిగింది. ఈ సమావేశంలో అంగన్ వాడీ సూపర్‌వైజర్ కృపావరం మాట్లాడుతూ అంగ న్‌వాడీ కార్యకర్తలు పనితీరుపై సమీక్షించారు. పిల్లలకు ప్రభుత్వం అందించే ప్రతి ఒక్క వస్తువును పోషకాహారం మరియు గుడ్లు సకాలంలో అందేలా చర్యలు తీసుకోవాలని ఆమె అన్నారు. గ్రామాల్లో లబ్ధిదారులకు సక్రమంగా పౌష్టికాహారం అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో రసూల్, ప్రాజెక్టు కో ఆర్డినేటర్ సామేలు, సెక్టారు సూప ర్‌వైజర్ సరళ, కార్యకర్తలు పాల్గొన్నారు.

నేటి సమాజానికి జాషువ రచనలు ఆదర్శం

విశాలాంధ్ర, తెనాలి : నేటి సమాజానికి జాషువ రచనలు మార్గదర్శకమని పలువురు వక్తలు అన్నారు. గుర్రం జాషువ 53వ వర్ధంతిని పురస్కరించుకుని గుర్రం జాషువ విజ్ఞాన సమితి ఆధ్వర్యంలో బుధవారం ఉదయం జరిగిన కార్యక్రమంలో స్థానిక బస్టాండ్ వద్ద కల జాషువ విగ్రహానికి పూలమాలలు వేసి పలువురు నివాళు లర్పించారు. ఉపాధ్యాయునిగా జీవితం ప్రా రంభించిన జాషువ సాహితీవేత్తగా ఎదిగి 59 ఖండకావ్యాలు, 14 నాటకాలు రాసారని, అల నాటి సమాజంలోని రుగ్మతలను రూపుమా పేందుకు తన రచనల ద్వారా సమాజంలో చైతన్యం తీసుకువచ్చిన విశ్వనరుడు జాషువ అని వక్తలు కొనియాడారు. ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న డాక్టర్ పొన్నెకంటి రత్నాకర్ ఇటీవల బాపూ జగజ్జీవనరామ్ ఛైర్ కు సంచాలకులుగా నియ మితులైన నేపథ్యంలో గుర్రం జాషువ విజ్ఞాన సమితి నిర్వా హకులు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమలో జె. న్యూటన్, పి. రవికుమార్, కొండమూడి రమేష్, వి.రత్నం, పి. రాజగోపాల్, గరికిపాటి సుబ్బారావు, షేక్ అబ్దుల్ హకీం జాని, యండ్రపాటి అశోక్‌కుమార్, కె. సింగయ్య, వి. రాజారత్నం, ఏ.మల్లేశ్వరరావు, కె. దేవయ్య, శరత్ వెంకయ్య, సుద్దపల్లి మురళీధర్, కె. లక్ష్మణరావు, ఎల్. ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.

జగన్ దొంగ డ్రామాలు అట్టర్ ఫ్లాప్ : ప్రత్తిపాటి

విశాలాంధ్ర-చిలకలూరిపేట: ప్రజల దృష్టిని మళ్లించడానికి దేశ రాజధాని ఢిల్లీలో మాజీ ముఖ్యమంత్రి జగన్‌రెడ్డి ఆడిన డ్రామాలు, చేసిన దొంగ ధర్నా అట్టర్ ఫ్లాప్ అయ్యాయని మాజీ మంత్రి, టీడీపీ సీనియర్ ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు ఎద్దేవా చేశారు. ఇన్నాళ్లు చేసిన చేసిన హత్యలు, దారుణాల రక్తపు మరకల్ని అంత త్వరగా తుడిచేసుకోవడం కూడా సాధ్యం కాదని ఈ పరిణామాలు అతడికి అర్థం అయ్యేలా చేశాయని, జగన్ రెడ్డి ఢిల్లీ ధర్నాను కనీసం పట్టించుకున్న వారు ఎవరు లేరని చురకలు వేశారు.

రాష్ట్రంలో శాంతిభద్రతలపై ఏదో జరిగిపోతోందంటూ ఢిల్లీలో జగన్ బుధవారం చేసిన ధర్నాపై ఒక ప్రత్యేక పత్రికా ప్రకటనను విడుదల చేశారు.

చిలకలూరిపేటలో విద్యార్థులకు ఆటల పోటీలు

విశాలాంధ్ర-చిలకలూరిపేట: మున్సిపల్ స్కూల్‌లో శిక్షా సప్తాహ్‌లో భాగంగా క్రీడా దినోత్సవం కేంద్ర ప్రభుత్వం జాతీయ విద్యావిధానం (2020) అమలు చేసి నాలుగేళ్లు పూర్తయిన సందర్భంగా జూలై 22 నుండి 29 వరకు 'శిక్షాసప్తాహ' కార్యక్రమం నిర్వహిస్తుంది. అందులో భాగంగా బుధవారం క్రీడాదినోత్సవం సందర్భంగా విద్యార్థినీ విద్యార్థులు లచే ఆటల పోటీలు నిర్వహించారు రన్నింగ్, స్కిప్పింగ్ బాల్ క్యాచ్ పోటీలు నిర్వహించి గెలిచిన విద్యార్థినీ విద్యార్థులుకు బహుమతి ప్రదానం చేయడం జరిగింది. ఈ పోటీల వల్ల విద్యార్థులకి పోటీ తత్వం అలవడుతుంది అని అన్నారు. పాఠశాల ఉపాధ్యా యులు పోటు శ్రీనివాసరావు, ఏ నీలిమ, పేరెంట్స్ కమిటీ సభ్యులు విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

పాడి రైతుల సంక్షేమానికి సంగం డెయిరీ కృషి

విశాలాంధ్ర-శావల్యాపురం: పాడిరైతుల సంక్షేమమే లక్ష్యంగా సంగండెయిరీ నిరంతరం కృషి చేస్తుందని వినుకొండ సంగం డెయిరీ మేనేజర్ కొత్తపల్లి నాగప్రభు అన్నారు. మండ లంలోని వయ్యకల్లు గ్రామంలోని సంగం డెయిరీ వెండార్ సెంటర్లో బోనసుల పంపిణీ కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. సెంటర్లోని 24 మంది పాలఉత్పత్తిదారులకు మొత్తం రూ. 1,25,606లు బోనస్ పంపిణీ చేశారు. వారిలో అత్యధికంగా దారా దేవిడ్ రూ.23,073, మర్రి కోటేశ్వరరావు రూ.13,239, దారా అంజయ్య రూ.12,546 లను బోనస్‌గా పొందారు. సంగం డెయిరీ డైరెక్టర్ గడిపూడి ఆంజనేయులు మాట్లాడుతూ పాల ఉత్పత్తిదారులకు రాయితీలు, బోనస్లలను అందించ డమే కాక సంగండెయిరీ ద్వారా లబ్దిదారులకు డివిఆర్ హస్పిటల్ ద్వారా రాయితీపై వైద్య సేవలు, పశు వైద్య సేవలను ఉచితంగా అందించడం జరుగుతుందన్నారు. వయ్యకల్లులో రూ.100కి రూ.3 చొప్పున బోనస్ గా పంపిణీ చేశామన్నారు. కార్యక్రమంలో సెంటర్ అధ్యక్షులు గోరింట్ల పెదయోగయ్య, సూపర్వైజర్ రామాంజనేయులు, కోఆర్డినేటర్ రామకోటయ్య, గ్రామస్తులు నడింపల్లి లక్ష్మయ్య, గోరింట్లు వీరవెంకటేశ్వర్లు, మర్రి కోటేశ్వరరావు పాల్గొన్నారు.

బాల్య వివాహాలు... అభివృద్ధి నిరోధకాలు

విశాలాంధ్ర-రెంటచింతల: చిన్న వయసులోనే బాలికలకు వివాహాలు చేయడం వల్ల వ్యక్తిగతంగా వారితోపాటు సమాజాభివృద్ధికి నిరోధకాలుగా మారుతున్నాయని, బాలల హక్కులను కాలరాచే బాల్య వివాహాలను ప్రోత్సహించడం శిక్షార్హమని ఐసీడీఎస్ రెంటచింతల మండల సూపర్వైజర్ నాగమణి అన్నారు. బుధవారం మండల పరిధిలోని పాల్వాయి గ్రామంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో నిర్వహించిన మిషన్ శక్తి- భారతీయ న్యాయ సంహిత అవగాహన కార్యక్రమంలో విద్యార్థులకు బాల్య వివాహాల నిరోధక చట్టంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పాల్గొన్న వైద్యులు ప్రదీప్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ తల్లిదండ్రులు, ప్రజల్లో మార్పు వస్తేనే బాల్య వివాహాలు నిర్మూలించవచ్చన్నారు. బాలికలకు 18 సంవత్సరాలు లోపు వివాహం చేయడం నేరమని, బాలికలను చదివించినప్పుడే వారు చైతన్యవంతుల వుతారని అప్పుడే బాల్య వివాహాలకు అడ్డుకట్ట పడుతుందన్నారు.

కార్యక్రమంలో ఆరోగ్య సిబ్బంది, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఏపీకి సాయంపై హర్షం

విశాలాంధ్ర - బాపట్ల టౌన్ : ఎన్డీఏ ప్రభుత్వం నూతనంగా ఏర్పడిన తరువాత తొలి బడ్జెట్ సమావేశాలలో కేంద్ర ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రా అభివృద్ధికి రూ.15 వేల కోట్లు కేటాయించటంపై నియోజకవర్గ జనసేన పార్టీ సమన్వయకర్త నామన వెంకట శివన్నారాయణ హర్షం వ్యక్తం చేశారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీకి , బడ్జెట్ ప్రతిపాదించిన ఆర్థిక మంత్రి నిర్మల సీతారామన్, రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పీఎం ఆవాస యోజన క్రింద పట్టణ గృహాలకు 2.2 లక్షల కోట్ల ప్రోత్సాహం. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ తన బడ్జెట్ ప్రసంగంలో రూ .10 లక్షల కోట్ల రూపాయల పెట్టుబడితో 1 కోటి పట్టణ పేద మధ్య తరగతి కుటుంబాల గృహ అవసరాలను పరిష్కరిస్తామని ప్రకటించారన్నారు. మధ్య తరగతి ప్రజల కోసం ఉద్యోగులకు ఆదాయపన్ను జీతం నుండి మినహాయించి స్టాండర్డ్ డిడక్షన్ రూ.50,000 నుంచి 275,000కి పెంచడం జరిగిందన్నారు. ఆదాయపన్ను స్లాబులు మార్పుల వల్ల రూ.17,500 సేవింగ్స్ కి ఆస్కారం ఏర్పడిందన్నారు. పెన్షనర్ల కు కుటుంబ పెన్షన్ మినహాయింపు రూ.15,000 నుండి 25,000 కి పెంచబడిందన్నారు. సౌరశక్తి భాగాలు సౌరశక్తికి సంబంధించిన భాగాలపై కస్టమ్సున్ను డ్యూటీ ఉండకూడదని ప్రభుత్వం ప్రతిపాదించిందన్నారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహనరెడ్డి ఢిల్లీలో ధర్నా చేయటానికి జనసేన పార్టీ తరఫున తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు.

వెలగపూడి సేవలు వెలకట్టలేనివి

విశాలాంధ్ర - బాపట్ల : బాపట్ల పట్టణ మొట్టమొదటి మున్సిపల్ చైర్ పర్సన్ వెలగపూడి సుబ్బారావు 137 వ జయంతి కార్యక్రమం బుధవారం ఫోరం ఫర్ బెటర్ బాపట్ల ఆధ్వర్యంలో చంద్రకళా పార్కులో ఘనంగా జరిగింది. మున్సిపల్ కమిషనర్ వి.నిర్మల కుమార్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. వెలగపూడి విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ బాపట్లకు పట్టణ శోభ కల్పించిన వారిలో అగ్రగణ్యులు వెలగపూడి సుబ్బారావు అని చెప్పారు. పట్టణ ప్రథమ మున్సిపల్ చైర్మన్‌గా ఆయన బాపట్లకు విశేష సేవలందించారు. పట్టణం నడిబొడ్డున అరెకరం స్థలం బాలికల పాఠశాలకు దానం చేసిన ఆయన త్యాగం మరపురానిది అని తెలిపారు. సుబ్బారావు విగ్రహాన్ని సముచిత స్థానంలో నెలకొల్పుతామని హామీ ఇచ్చారు. ఫోరం కార్యదర్శి డాక్టర్ పిసి సాయి బాబు మాట్లాడుతూ వెలగపూడి సుబ్బారావు బాపట్ల చరిత్ర తెలుపుతూ చంద్ర కళా పార్కుల్లో 'జయ స్థూపాన్ని' నెలకొల్పరని చెప్పారు. దానిని ఫోరం పునరుద్ధరించిందని వివరించారు. ఏవీవీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు వై.సత్యవతి, ఉపాధ్యాయులు ఉమామహేశ్వరరావు, నాగేశ్వరరావు, శ్రీనివాసరావు, చేజెర్ల సతీష్ విద్యార్థులు పాల్గొన్నారు.

నేరాల నియంత్రణ పరిశోధనలో

సీసీ కెమెరాలు పాత్ర కీలకం

- ◈ ప్రధాన కూడలిలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలి
- ◈ ప్రజలకు అవగాహన కల్పించాలి
- ◈ సిబ్బందికి ఎస్పీ తూషార్ డూడీ ఆదేశం

విశాలాంధ్ర - బాపట్ల : నేరాల నియంత్రణలో, నేరాల పరిశోధనలో సీసీ కెమెరాలు పాత్ర కీలకమని జిల్లా ఎస్పీ తుషార్ డూడి తెలిపారు. జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో బుధవారం సీసీ కెమెరాల ఆవశ్యకతను గురించి జిల్లా ఎస్పీ వివరించారు. ఈ సందర్భంగా ఎస్పీ జిల్లా ఎస్పీ మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో నేరాలు జరుగుతున్న తీరు, నేరస్తులు నేరం చేసే విధానం అనేక విధాలుగా ఉంటున్నాయన్నారు. నేరాలను చేదించడం పోలీస్ శాఖకు సవాలుగా మారుతుందని తెలిపారు. సీసీ కెమెరాల ఆధారంగా నేరాలను వేగవంతంగా చేదించవచ్చని తెలిపారు. జిల్లాలోని ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలోని ముఖ్యమైన ప్రాంతాలు, కూడళ్ళు, రద్దీ ప్రదేశాలలో సీసీ కెమెరాలు తప్పనిసరిగా ఏర్పాటు చెయ్యాలని అధికారులకు సూచించారు. సీసీ కెమెరాలు ఉన్న ప్రదేశాలలో నేరస్తులు నేరాలు చెయ్యడానికి బయపడతారని, మహిళలకు, వ్యాపారస్తులకి భద్రత పెరుగుతుందని తెలిపారు. పోలీస్ స్టేషన్‌ల పరిధిలలోని ముఖ్యమైన ప్రాంతాలలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకొని పరిశీలించడం వలన ముందస్తుగా నేరాలు జరగకుండా నియంత్రించవచ్చన్నారు. అంతేకాకుండా నేరం జరిగిన తర్వాత నిందితుల కదలికలను గుర్తించడానికి, నిందితులు ఎవరనేది తెలుసుకోవడానికి సీసీ కెమెరాలు ఎంతగానో ఉపయోగపడ తాయన్నారు. సీసీ కెమెరాల వలన కలిగే ప్రయోజనాల గురించి, వాటి ఆవశ్యకతను గురించి ప్రజలకు, వ్యాపారస్తులకు అవగాహన కల్పించాలని పోలీస్ అధికారులకు సూచించారు. గతంలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల పనితీరును ఎప్పటికప్పుడు పర్యవేక్షించుకుంటూ ఉండాలన్నారు. సీసీ కెమెరాల వలని 24/7 గంటలు నిఘా ఉంటుందని, దుకాణాల వద్ద, ఇంటి పరిసరాలలో ప్రజలు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవడం వల్ల ఎంతో ఉపయోగం ఉంటుందని, సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకుంటే పటిష్టమైన భద్రత లభిస్తుందని, ముఖ్యంగా ఒంటరిగా ఉండే మహిళలలు వారి ఇంటి పరిసరాలలో, రద్దీగా ఉండే వ్యాపార సముదాయాలలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని ఎస్పీ ప్రజలకు సూచించారు.

ఏపీ అభివృద్ధి ఎన్డీఏ ప్రభుత్వం పూర్తి మద్దతు

- ◆ రాజధాని నిర్మాణానికి రూ.15 వేల కోట్లు నిధులు
- ◆ పోలవరం నిర్మాణానికి నిధులను విడుదల
- ◆ యువతకు ఉపాధి, నైపుణ్యం ఉద్యోగ అవకాశాలు
- ◆ ఆక్వాకల్చర్ ఉత్పాదకతను ఎగుమతులను పెంపొందించడం
- ◆ వ్యవసాయ ఆధారిత రంగానికి రూ.1.27 లక్షల కోట్లు
- ◆ మాజీ ఎమ్మెల్సీ అన్నం సతీష్ ప్రభాకర్

విశాలాంధ్ర - బాపట్ల టౌన్ : ఎన్డీఏ ప్రభుత్వం ఏపీ అభివృద్ధికి పూర్తి మద్దతుగా ఉంటుందని ప్రభుత్వం ఏర్పడిన తర్వాత పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలులో ఆంధ్ర రాష్ట్రా నికి ప్రత్యేక నిధులను కేటాయించడం హర్షించదగ్గ విషయమని మాజీ ఎమ్మెల్సీ అన్నం సతీష్ ప్రభాకర్ తెలిపారు. బీజేపీ కార్యాలయంలో మీడియాతో ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వ పాలనలో రాష్ట్రానికి తీరని అన్యాయం జరిగిందని ఎన్డీఏ హయాంలో ప్రభుత్వంలో కచ్చితంగా రాష్ట్రాన్ని అన్ని రకాలుగా అభివృద్ధి చేస్తామని ఆర్థిక మంత్రి నిర్మల సీతారామన్ భరోసా కల్పించడం శుభపరిణామం అన్నారు. రాష్ట్రానికి జరిగిన నష్టాన్ని నివారించి భవిష్యత్తులో మరింత ముందుకు తీసుకెళ్ళే విధంగా కృషి చేస్తున్నారని చెప్పారు. ఏపీని మిగిలిన అన్ని రాష్ట్రాల కంటే మిన్నగా ఉండేలాగా రాబోయే 5 సంవత్సరాల్లో ఆర్థిక సహాయ సహకారాలు అందిస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. భారతీయ జనతా పార్టీకి ఆంధ్రప్రదేశ్ మీద ప్రత్యేకమైన శ్రద్ధ ఉందని వెనుకబడ్డ మనల్ని ముందుకు తీసుకువెళ్లాలని ముఖ్య సంకల్పంగా పెట్టుకుందన్నారు. బడ్జెట్‌లో ఉత్పాదకత, ఉపాధి, సామాజిక న్యాయం, పట్టణాభివృద్ధి, ఇంధన భద్రత, మౌలిక సదుపాయాలు, నూతన ఆవిష్కరణలు సంస్కరణలు అనే తొమ్మిది అంశాలకు ప్రాధాన్యత ఇచ్చారన్నారు. యువత కోసం రూ.2 లక్షల కోట్ల వ్యయంతో రానున్న 5 సంవత్సరాలలో 4.1 కోట్ల మంది యువతకు ఉపాధి, నైపుణ్యం ఇతర అవకాశాలను సులభతరం చేయడానికి ఐదు పథకాలు రూపకల్పనకు కేంద్ర ప్రభుత్వం ఈ బడ్జెట్ ద్వార ప్రత్యేక ప్రణాళిక అమలు చేస్తోందన్నారు. 500 అగ్రశ్రేణి సంస్థల్లో కోటి మంది యువతకు ఇంటర్న్ షిప్ అవకాశాలు కల్పనకు ప్రణాళిక రూపొందించిందన్నారు. ఎగుమతులను రెట్టింపు చేయడం మరిన్ని ఉద్యోగావకాశాలను సృష్టించ డం లక్ష్యంగా ప్రధాన మంత్రి మత్స్య సంపద యోజన అమలును ముమ్మరం చేయడానికి బడ్జెట్ ఊతం ఇస్తుందన్నారు. పియమ్ కిసాన్ యోజన కింద రూ.11.8 కోట్ల మంది రైతులకు నేరుగా ఆర్థిక సహాయం అందించడం ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన ద్వారా 4 కోట్ల మంది రైతులు పంటల బీమా కవరేజీని అందించడానికి గ్రామీణ ఉపాధి హామీ పథకం కోసం రూ 86,000 కోట్లు కేటాయింపులు జరిగాయన్నారు. భాజపా జిల్లా అధ్యక్షుడు యార్లగడ్డ లక్ష్మీనారాయణ మాట్లడుతూ వికసిత ఆంధ్ర ప్రదేశ్ దిశగా కేంద్ర బడ్జెట్ కేటాయింపులు ఆహ్వానిస్తున్నామని ప్రధాని నరేంద్ర మోడీ,ఆర్థిక మంత్రి నిర్మల సీతారామన్‌కు భాజపా జిల్లా అధ్యక్షుడు యార్లగడ్డ లక్ష్మీనారాయణ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. బీజేపీ జిల్లా అధ్యక్షులు యార్ల గడ్డ లక్ష్మీనారాయణ, రాష్ట్ర యువ మోర్చ ట్రెజరర్ బొడ్డు కృష్ణ చైతన్య, యువ మోర్చ జిల్లా అధ్యక్షులు నాశన మణి కుమార్, మోహన్ గౌడ్, బాబు నాగేంద్ర, కొట్ర రామకృష్ణ, రమేష్, శ్రీనివాసరాజు పాల్గొన్నారు.

బాపట్ల జె.యమ్.క్రియేషన్స్ లఘుచిత్రానికి తృతీయ బహుమతి

విశాలాంధ్ర - బాపట్ల : కళాప్రపూర్ణ దాశరథి శతజయంతి సందర్భంగా దాశరథి ఫిల్మ్ సొసైటీ హైదరాబాద్ ఆధ్వర్యంలో నిర్వహించిన షార్ట్ ఫిల్మ్ పోటీల్లో బాపట్లకు చెందిన జె.యమ్.క్రియేషన్స్ విముక్తి లఘుచిత్రం తృతీయ బహుమతి గెలుపొందిందని డైరెక్టర్ వి.యస్.యస్.ప్రసాద్ తెలిపారు. హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగిన బహుమతి ప్రధానోత్సవ సభలో రూ.10,000, జ్ఞాపిక, ప్రశంసాపత్రాన్ని డైరెక్టర్ చిత్ర సభ్యులు అతిథుల చేతుల మీదుగా అందుకున్నారు. ఆధునిక పోకడలని దృష్టిలో పెట్టుకుని చిత్రీకరించిన విముక్తి షార్ట్ ఫిల్మ్ నేటి సమాజాన్ని చైతన్య పరిచే విధంగా ఉందని ముఖ్య అతిథి ప్రముఖ కవి నందిని సిధారెడ్డి అన్నారు. ఈ చిత్రానికి సంగీతం ఆక్సి,



కెమెరా సురేష్, అజయ్, ఎడిటింగ్ కె. సతీష్, నటీనటులు యమ్.యల్.వి.ప్రసాద్, రావు రంగారావు, శివశంకర్, రామాంజి, ఇమ్మడిశెట్టి సురేష్, నాగతేజ, బ్రహ్మేశ్వరి, సుబ్బులమ్మ, రాజి, పల్లవి. ఈ సందర్భంగా బాపట్ల పుర ప్రముఖులు తదితరులు చిత్ర సభ్యులకు అభినందనలు తెలియజేశారు.

మహిళల అభ్యున్నతే ప్రభుత్వ లక్ష్యం: సుబ్బారావు

విశాలాంధ్ర - కర్లపాలెం : మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో మండల సమాఖ్య సమావేశం ఎస్.కే నసీమా అధ్యక్షతన బుధవారం జరిగింది. బాపట్ల ఏరియా కో ఆర్డినేటర్ డి.పి.ఎం ఉసురపాటి సుబ్బారావు ముఖ్యఅతిధిగా హజరై మాట్లాడుతూ మహిళా సంఘాలు క్రమం తప్పక సమావేశాలు నిర్వహించుకుంటూ పొదపులు అప్పులు సకాలంలో చెల్లించాలని తెలిపారు. ప్రభుత్వం మహిళా పక్షపాతంతో జీవనోపాదుల మెరుగుకు ప్రాదాన్యత కల్పిస్తున్నారన్నారు. ఈ క్రమంలో ప్రతి మహిళా ప్రభుత్వం సహకారముతో బ్యాంకు అనుసందానం ,స్త్రీనిది ,ఉన్నతితో పాటు కేంద్రప్రభుత్వం ప్రత్యేకంగా ప్రవేసపెట్టిన రుణాలలో భాగంగా లఘుపతి



ధీధీ ననుసరించి వ్యక్తిగత రుణాలకు ప్రాధాన్యం కల్పిస్తుందన్నారు. ఎ.పి.ఎం శీనివాసులు రెడ్డి మాట్లాడుతూ ప్రతి మహిళ లక్షాధికారిణి చేయటమే కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ఏకైక ద్యేయముగా పనిచేస్తున్నాయని ,ప్రభుత్వ పథకాలు అందిపుచ్చుకొని ప్రభుత్వ కలను నిజం చేయాలని సూచించారు.